



నీటితో నిండిన కొత్తవలస అండర్ బ్రిడ్జి

రైల్వే క్రాసింగ్‌ల వద్ద గేట్‌ల కారణంగా గంటల తరబడి పడిగాపులు కాసే ప్రజలకు ఉపశమనం కలిగించాలని భావించిన ప్రభుత్వం రైల్వే అండర్ బ్రిడ్జిలను తీసుకొచ్చింది. కానీ వాటితో మరిన్ని అవస్థలు మొదలయ్యాయి. కొన్నిచోట్ల నరకయాతన పడుతున్న ప్రయాణికులు, స్థానికులు అండర్ బ్రిడ్జిల కన్నా రైల్వే గేట్‌లే నయం అంటున్నారు. వర్షం కురిసినప్పుడు బ్రిడ్జిల కిందకు భారీగా నీరు చేరి ఇరువైపులా రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఈ సమస్యపై ఇటీవల మంగళపాలెంలో స్థానికులు నిరసన తెలిపారు. కనీసం ఫుట్ ఓవర్ బ్రిడ్జి అయినా నిర్మించాలని డిమాండ్ చేశారు.

# అండర్ బ్రిడ్జిలు

మంగళపాలెం అండర్ బ్రిడ్జి వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్థులు(ఫైల్)



- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- భారీ వర్షాల సమయంలో నరకయాతన
- ఇరువైపులా నిలిచిపోతున్న రాకపోకలు
- రైల్వే గేట్‌లే నయం అంటున్నవైనం
- మంగళపాలెం వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జికి మంత్రి హామీ

కొత్తవలస, జూలై 23(ఆంధ్రజ్యోతి): కొత్తవలస మండలంలో ఎనిమిది చోట్ల రైల్వేక్రాసింగ్‌లు ఉండేవి. వీటికి సంబంధించి రెండు చోట్ల ఫ్లైఓవర్లు, నాలుగు చోట్ల అండర్ బ్రిడ్జిలు నిర్మించారు. మరో రెండు చోట్ల ఇంకా లెవిల్ క్రాసింగ్‌లు ఉన్నాయి. రాష్ట్రంలోని ఏ మండలంలో లేనన్ని రైల్వే క్రాసింగ్‌లు కొత్తవలస మండలంలో ఉన్నాయి. వీటిలో కొన్ని కాపలాదారునిగా ఉన్నవి కాగా మరికొన్ని ఎటువంటి కాపలా లేనివి. కేంద్రం ప్రభుత్వం ప్రతి రైల్వే క్రాసింగ్ వద్ద అండర్ బ్రిడ్జి కాని, ఫ్లైఓవర్ కాని నిర్మించాలని నిర్ణయించింది. కొత్తవలస రైల్వే గేట్ వద్ద రైల్వే ఫ్లైఓవర్ కాకుండా అండర్ బ్రిడ్జి నిర్మించారు. అలాగే మంగళపాలెం, నిమ్మలపాలెం, దేశపాత్రునిపాలెం, కొత్తూరు కంటకాపల్లి వద్ద కూడా అండర్ బ్రిడ్జిలు నిర్మించారు. అప్పటి నుంచే ప్రజలకు అసలైన కష్టాలు మొదలయ్యాయి. ఒక్కో చోట ఒక్కో తరహా సమస్యలు తెరమీదకు వచ్చాయి.

- కొత్తవలస అండర్ బ్రిడ్జికి సంబంధించి చిన్న వర్షం కురిసినా అండర్ బ్రిడ్జిలోకి నీరు చేరిపోవడంతో రెండువైపుల నుంచి రాకపోకలు నిలిచిపోతున్నాయి. గతంలో నాలుగో ఐదో రైళ్లు వెళ్లిన తరువాతైనా గేట్ తీసేవారు. రాకపోకలు సాగేవి. ఇప్పుడు వర్షం పడితే ఎప్పుడు వెళతామో (మిగతా 8వ పేజీలో..)



మంగళపాలెం అండర్ బ్రిడ్జి వద్ద మునిగిన కారు

## పిడుగు పడి రైతు మృతి

- జాడపేటలో నాట్లు వేస్తుండగా ఘటన
- మరో ముగ్గురికి అస్వస్థత



శ్రీను(ఫైల్)

రేగిడి, జూలై 23(ఆంధ్రజ్యోతి): పొలం పనిచేస్తున్న అన్నదాతను మృత్యువు పిడుగుపాటు రూపంలో కబళించిన ఘటనిది. జాడపేట( వెంకటరంగరాయపురం) గ్రామంలో బుధవారం మధ్నాహ్నం చోటుచేసుకొంది. గ్రామానికి చెందిన రైతు అలబోయిన శ్రీను(47) మృతిచెందగా, మరో ముగ్గురు రైతులు అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటనతో గ్రామస్థులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. వారు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

జాడపేటకు చెందిన అలబోయిన శ్రీను గ్రామానికి కూతవేటు దూరంలోని తన వ్యవసాయ పొలంలో వరినాట్లు వేసేందుకు బుధవారం వెళ్లాడు. గ్రామానికి చెందిన తోటి రైతులు, కుమా రుడు గంగరాజుతో పనులు చేపట్టాడు. భోజన సమయం అయ్యాక అందరూ పొలం బయటకు వచ్చేశారు. శ్రీను, మరో ముగ్గురు రైతులు మాత్రం నాట్లు సర్దేందుకు మళ్లీ పొలంలోకి వెళ్లారు. ఆ సమయంలోనే భారీ వర్షం కురిసింది. పెద్ద శబ్ధం చేస్తూ శ్రీనుకు సమీపంలో పిడుగు పడింది. దీంతో ఆయన ఒక్కసారిగా కుప్పకూలిపోగా లుకలాపు రామినాయుడు, పొండ్రంకి బంగారి, పులవిందుల అదినారాయణ స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. వీరికి గ్రామస్థులు సపర్యలు చేయడంతో కొద్దిక్షణాల్లో తేరుకొన్నారు. అపస్మారక స్థితిలో ఉన్న శ్రీనును 108లో కుటుంబీకులు రాజాం ప్రాంతీయ అసుపత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

- శ్రీను సన్నకారు రైతు. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్నాడు. భార్య నీలమ్మతో పాటు కొడుకులు గంగరాజు, వెంకటేష్ ఉన్నారు. వెంకటేష్‌కు ఇంకా పెళ్లికాలేదు. కుటుంబానికి శ్రీనే అధారం కాగా పొలం పనికి వెళ్లి మృతిచెందడాన్ని కుటుంబీకులు జీర్ణించుకోలేకపోతున్నారు.



- ఒడిశాలో కొనుగోలు
- హైదరాబాద్‌కు తరలించాలని ప్రణాళిక
- ఛేదించిన పోలీసులు
- ముగ్గురు నిందితుల అరెస్టు
- 30 కిలోల గంజాయి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ శ్రీనివాసరావు

## ట్రాలీ సూట్ కేసులో గంజాయి



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

విజయనగరం క్రైం, జూలై 23(ఆంధ్రజ్యోతి): ట్రాలీ సూట్‌కేసులో గంజాయి తరలిస్తే ఎవరూ గుర్తించలేరని అనుకున్నారు. సాధారణ ప్రయాణికుల్లా విజయనగరంలో రైలు దిగి సూట్‌కేసులను నడుపుతూ ఓ లాడ్జికి వెళ్తున్నారు. ముందే పక్కా సమాచారం ఉండడంతో పోలీసులు నిఘా పెట్టి వారిని తనిఖీ చేశారు. గంజాయి రవాణా గుట్టు రట్టు చేశారు. 30 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. ఈ వివరాలను విజయనగరం డీఎస్పీ శ్రీనివాసరావు వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో బుధవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు.

రైలులో ముగ్గురు వ్యక్తులు గంజాయి తీసుకువస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. రవాణాదారులు విజయనగరంలో రైలు దిగుతారని తెలిసింది. అప్రమత్తమైన వన్‌టౌన్ ఎస్‌ఐ రామగణేష్ సిబ్బందితో రైల్వే స్టేషన్ వద్దకు చేరుకుని నిఘా పెట్టారు. అనుమానాస్పద వ్యక్తులను తనిఖీ చేశారు. అంతలో రైల్వేస్టేషన్ లోపలి నుంచి ముగ్గురు వ్యక్తులు ట్రాలీ సూట్ కేసులను నడుపుకుంటూ బయటకు వచ్చారు. సమీపంలోని లాడ్జికి వెళ్తుండగా పోలీసులు అడ్డుకుని తనిఖీ చేశారు. ఒక ట్రాలీ సూట్‌కేసులో 13 కిలోలు, మరో సూట్‌కేసులో 17 కిలోలు కలిపి 30 కిలోల గంజాయిని గుర్తించారు. వారి వద్ద నుంచి నాలుగు ఆండ్రాయిడ్ ఫోన్లు, రెండు కీప్యాడ్ ఫోన్లు, రూ.4 వేల నగదును కూడా స్వాధీనం చేసుకున్నారు. ఒడిశా రాష్ట్రం కళహండి జిల్లా ఉచ్చల గ్రామానికి చెందిన పితామాంబర్ నాగ్, అదే జిల్లా బిరమల గ్రామానికి చెందిన చంద్రకరుణ్, అదే జిల్లా చార్‌బహల్ గ్రామానికి చెందిన ప్రదీప్‌నాయక్‌లను అరెస్టు చేశారు. గంజాయిని ఒడిశా నుంచి విజయనగరం మీదుగా హైదరాబాదు తరలిస్తున్నట్టు విచారణలో ఒప్పుకున్నారు. పితామాంబర్ (మిగతా 8వ పేజీలో..)

## అంకితభావంతో విధులు నిర్వర్తించండి

- విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జెట్టి



ప్రొబేషనరీ ఎస్‌ఐలతో డీఐజీ గోపినాథ్ జెట్టి

విశాఖపట్నం/ విజయనగరం క్రైం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): అంకితభావంతో విధులు నిర్వహించాలని ప్రొబేషనరీ ఎస్‌ఐలకు విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్‌జెట్టి సూచించారు. శిక్షణ పూర్తిచేసుకుని వచ్చిన 49 మంది (33 మంది పురుషులు, 16 మంది మహిళలు) ప్రొబేషనరీ ఎస్‌ఐలు బుధవారం విశాఖ నగరంలోని రేంజ్ కార్యాలయంలో డీఐజీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో నిబద్ధత, నిజాయితీ, సేవాతత్పరత ముఖ్యమన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ, నేర పరిశోధన, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం, వృత్తిపరంగా ఎదురయ్యే సవాళ్లను అధిగమించడానికి సిద్ధంగా ఉండాలన్నారు. పోలీసు (మిగతా 8వ పేజీలో..)



## బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలి

- కలెక్టర్ అంబేడ్కర్ పిలుపు



విజయనగరం కలెక్టరేట్, జూలై 23(ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనే పీ-4 కార్యక్రమం ప్రధాన లక్ష్యమని, బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేందుకు ముందుకు రావాలని కలెక్టర్ అంబేడ్కర్ పిలుపునిచ్చారు. ఔదార్యంతో ముందుకొచ్చి మార్గదర్శులుగా నిలవాలని కోరారు. పీ-4 విధానంలో బంగారు కుటుంబాలు, మార్గదర్శులపాత్రపై జిల్లాలోని పారిశ్రామిక వేత్తలతో బుధవారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలో సున్నా పేదరికం లక్ష్యంగా పీ-4 కార్యక్రమాన్ని సీఎం తీసుకొచ్చారన్నారు. ఇప్పటి వరకూ పారిశ్రామిక వేత్తలు సీఎస్‌ఆర్ ద్వారా ప్రజలకు పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలను కల్పించేందుకు కృషి చేశారని, ఇక నుంచి పేదకుటుంబాలను వ్యక్తిగతంగా చైతన్య పరచడం, విద్య, ఇతరత్రా సహకారం అందించడం చేయాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికే జిల్లాలో 60,067 పేద కుటుంబాలను బంగారు కుటుంబాలుగా గుర్తించామని, వారిని దత్తత తీసుకొనేందుకు మార్గదర్శులు ముందుకు రావాలని కోరారు. బంగారు కుటుంబాల తుది జాబితాను తయారు చేసేందుకు మరో మారు గ్రామ సభలను నిర్వహిస్తున్నామని తెలిపారు. సమావేశంలో సీపీవో బాలాజీ, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజరు కరుణాకర్, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సరిత, వివిధ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

## పిల్లలంతా వస్తున్నారా?



కేంద్రంలో నిద్రపోతున్న బాలుడు



చలుమూరివాని పాలెంలో అద్దె భవనంలో నడుస్తున్న అంగన్వాడీ కేంద్రం శిథిలమైన దృశ్యం

- అంగన్వాడీ కేంద్రాల్లో అరకొరగా హాజరు
- పర్యవేక్షించని ఐసీడీఎస్ అధికారులు
- రికార్డుల్లో సంఖ్యకు, కేంద్రాలకు వస్తున్న వారి వివరాల మధ్య వ్యత్యాసం

వేపాడ, జూలై 23(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాల పనితీరు పక్కదారి పట్టింది. రికార్డుల్లో ఎక్కువ మంది వస్తున్నట్లు చూపుతున్నారు.. వాస్తవంగా చూస్తే అత్యల్పంగా ఉంటున్నారు. ఐసీడీఎస్ అధికారులు సమగ్రంగా పర్యవేక్షించపోవడంతో కేంద్రాలు సక్రమంగా నడవడం లేదు. అధికారులు వచ్చినప్పుడు ముందుగా తెలియడంతో అప్పటికప్పుడు కేంద్రాల నిర్వాహకులు చకచకా ఏర్పాట్లు చేసేయడం.. వారు ఎళ్లాక మళ్లీ వదిలేయడం సర్వసాధారణంగా మారింది.

చలుమూరివానిపాలెం అంగన్వాడీ కేంద్రంలో ఇద్దరు చిన్నారులు ఉన్నట్టు రికార్డుల్లో నమోదు చేశారు. కేంద్రంలో ఒక చిన్నారే ఉంటున్నారు. చలుమూరివానిపాలెం, చిన నల్లబిల్లి, వారాదికొంపలకు కలిపి ప్రభుత్వం (మిగతా 8వ పేజీలో..)



## ప్రాజెక్టులకు నిధులు

- సాగునీటి ఇబ్బందులను తొలగించేందుకు ప్రభుత్వ చర్యలు
- ఉమ్మడి జిల్లాకు రూ. 2.61 కోట్లు మంజూరు



చినమేరంగి సమీపంలో ఓఅండ్ఎం నిధులతో జరుగుతున్న కాలువ పనులు

జియ్యమ్మవలస, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఈ ఖరీఫ్ సీజన్‌లో సాగునీటికి ఆటంకం కలగ కుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆపరేషన్ అండ్ మెంటైనెన్స్ (ఓఅండ్ఎం) నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో ప్రాజెక్టుల పరిధిలోని కాలువ లైనింగ్‌లు, ఇతరత్రా అత్యవసర పనులు నీటి సంఘాల ఆధ్వర్యంలో చురుగ్గా జరుగుతున్నాయి. దీనిపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా పరిధిలో వట్టిగెడ్డ, పెద్దగెడ్డ, పెదంకలాం, వెంగళరాయసాగర్, జంఝావతి, తోటపల్లి ప్రాజెక్టులు ఉన్నాయి. వాటి ద్వారా ఉమ్మడి జిల్లాలో దాదాపు 2.45 లక్షల ఎకరాలకు సాగునీరందుతుంది. కాగా చిన్న , మధ్య తరహా ప్రాజెక్టులైన వట్టిగెడ్డ, పెద్దగెడ్డ, పెదంకలాం, వెంగళరాయసాగర్ ఆధునికీకరణకు జైకా నిధులు మంజూరైనప్పటికీ గత వైసీపీ ప్రభుత్వం ఎటువంటి పనులు చేపట్టలేదు. దీంతో ప్రాజెక్టులు, వాటి (మిగతా 8వ పేజీలో..)



# స్మార్ట్‌గా రేషన్ కార్డులు

● ఏటీఎం కార్డుల్లా రూపకల్పన
● పాతకార్డుల స్థానంలో కొత్తవి
● నేతల ఫొటోలు లేకుండా ప్రింటింగ్
● జిల్లాలో 50,408 దరఖాస్తులు

**అందిన దరఖాస్తులిలా..**

| | |
|---|---|
| చిరునామా మార్పుకోసం | 1,750 |
| ఆధార్ సీడింగ్ దిద్దుబాటు | 679 |
| కొత్తగా పేర్లు నమోదు కోసం | 37,135 |
| తొలగింపు | 1,063 |
| కొత్త కార్డుల కోసం | 3,253 |
| విభజన | 6,528 |

రాజాం రూరల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుల రూపరేఖలు మారబోతున్నాయి. సాంకేతిక పరిజ్ఞానంతో స్మార్ట్‌కార్డులు తయారవుతున్నాయి. పార్టీల రంగులు, నాయకుల ఫొటోలకు లేకుండా సిద్ధమవుతున్నాయి. బ్యాంకు ఏటీఎం కార్డును మాదిరి క్యూఆర్ కోడ్‌తో రూపొందుతున్నాయి. రేషన్‌కార్డుపై ప్రభుత్వ అధికారిక చిహ్నం, లబ్ధిదారుల ఫొటో మాత్రమే ఉండేలా పౌరసరఫరాల శాఖ ఇప్పటికే కసరత్తు పూర్తిచేసింది. కార్డుపై ఓ వైపు కుటుంబ పెద్ద ఫొటో మరోవైపు ప్రభుత్వ అధికారిక ముద్ర ఉంటాయి. రేషన్ కార్డు నెంబర్, రేషన్ షాపు నెంబరు, లబ్ధిదారుల కుటుంబ సభ్యుల వివరాలు ఉంటాయి. ఈ రేషన్‌కార్డును రేషన్ డీలర్ల వద్ద ఉన్న ఈ-పోస్ మెషిన్ సహాయంతో స్కాన్ చేస్తే ఆ కుటుంబానికి సంబంధించిన వివరాలు, సరుకుల వివరాల పూర్తి సమాచారం ప్రత్యక్షమవుతుంది. ముద్రణదశలో ఉన్న స్మార్ట్ రేషన్‌కార్డులను నెలాఖరులోగా లేదా ఆగస్టు మొదటివారంలో పంపిణీ చేసేందుకు పౌరసరఫరాలశాఖ ఏర్పాట్లు చేస్తోంది.

**వీలైనంత త్వరగా అందిస్తాం..**

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సాధ్యమైనంత త్వరగా లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్‌కార్డుల్ని అందజేస్తాం. వచ్చిన దరఖాస్తులకు సంబంధించి దాదాపుగా పరిశీలన, విచారణ పూర్తయింది. ఆధార్ సమస్యలు తలెత్తడంతో కొన్ని పెండింగ్‌లో ఉన్నాయి. దరఖాస్తు కోసం తుదిగడువు లేకపోవడంతో నిరంతర ప్రక్రియగా మారింది. దీంతో విడతల వారీగా పంపిణీ ప్రక్రియ సాగుతుంది..

- మధుసూధనరావు, జిల్లా పౌరసరఫరాల అధికారి, విజయనగరం

**50 వేల దరఖాస్తులు**

జిల్లాలో కొత్త రేషన్‌కార్డుల కోసం 50 వేలకు పైగా దరఖాస్తులు అందాయి, తమ కుటుంబ సభ్యుల్ని రేషన్‌కార్డుల్లో చేర్పించాలని వచ్చిన దరఖాస్తులే ఎక్కువగా ఉన్నాయి. ప్రధానంగా వివాహమైన మహిళలు తమ పిల్లల పేర్లను కార్డులో జోడించాలని దరఖాస్తు చేసుకున్నారు. కొత్తగా బియ్యంకార్డుల మంజూరు, ఉన్నవాటిలో మార్పులు, చేర్పుల కోసం సచివాలయాల ద్వారా ఈ ఏడాది మే 7 నుంచి అవకాశం కల్పించారు. తమ కుటుంబ సభ్యుల పేర్లు చేర్పించాలని 37,135 మంది దరఖాస్తు చేసుకున్నారు. కార్డుల విభజనతో పాటు కొత్తకార్డుల కోసం దరఖాస్తులుఅందాయి. కొత్తకార్డు, సభ్యుల పేర్లు నమోదు, తొలగింపు, విభజన, సరెండర్, చిరునామా మార్పు, తప్పుగా నమోదైన ఆధార్ సీడింగ్ దిద్దుబాటు వంటి ఏడురకాల సేవల్ని సచివాలయాల ద్వారా కల్పించారు. దీంతో 50,408 మంది దరఖాస్తులు చేసుకున్నారు.

**వైసీపీ హయాంలో పార్టీ రంగులు**

గత వైసీపీ ప్రభుత్వం రేషన్‌కార్డుకు పార్టీ రంగులు పులిమింది. కార్డుపై ఓవైపు అప్పటి సీఎం జగన్ బొమ్మ, పక్కనే మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బొమ్మ ముద్రించి లబ్ధిదారులకు పంపిణీ చేసింది. అక్కడితో ఆగకుండా దశాబ్దాల కాలంగా కొనసాగుతున్న రేషన్‌డిపోల వ్యవస్థకు మంగళం పాడింది. డిపోలపైనే ఆధారపడే వందలాది మంది ఉపాధిని దెబ్బతీసింది. నేరుగా ఇంటికే రేషన్ సరుకులంటూ ప్రచారం ఊదరగొట్టింది. కోట్లాది రూపాయల ప్రజా ధనాన్ని మంచినీళ్లలా ఖర్చుచేసి వందలాది ఎండీయూ వాహనాలను కొనుగోలు చేసింది. వీటి నిర్వహణ బాధ్యతల్ని పార్టీ కార్యకర్తలు, గ్రామస్థాయి నాయకులకు అప్పగించి వారికి నెలకు రూ. 22 వేల వంతున చెల్లిస్తూ ప్రభుత్వ ఖజానాకు కన్నం వేసింది. అయితే రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం గత వైసీపీ ప్రభుత్వ తప్పిదాలను, రాష్ట్ర ఖజానాపై భారంపడే పథకాలకు మంగళం పాడింది. పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సారథ్యంలో స్మార్ట్ రేషన్‌కార్డుల తయారీకి శ్రీకారం చుట్టింది.



పాత రేషన్ కార్డులు

# పారదర్శక పన్ను అవసరం

● ఉద్యోగుల నుంచే పక్కాగా వసూలు
● తప్పించుకుంటున్న అధికశాతం వర్గాలు
● నేడు జాతీయ ఆదాయపన్ను దినోత్సవం

● జిల్లాలోని ఓ గ్రామానికి చెందిన ఓ యువకుడు బాగా చదువుకున్నాడు. ఇతని విద్యార్హతకు సరిపడా ఉద్యోగం వచ్చింది. నెలకు పది అంకెల జీతం తీసుకుంటున్నాడు. ఆదాయం తగ్గట్టు పన్ను కట్టేస్తున్నాడు. అందుతున్న జీతమంతా కుటుంబ అవసరాలకు సరిపోతోంది. పెద్దగా సంపాదన కనిపించడం లేదు. ఇంటిని నిర్మించుకునేందుకు కూడా అవస్థలు పడుతున్నాడు. అద్దె ఇంట్లో ఉంటూ పిల్లలను చదివించుకుంటున్నాడు. ఏడాదికి రూ.లక్షల్లో పన్నుల రూపంలో చెల్లిస్తుండంతో ప్రభుత్వానికి మాత్రం ఆదాయం సమకూరుతోంది.




● మరో యువకుడు పెద్దగా చదువుకోలేదు. రియల్‌ఎస్టేట్ రంగంలోకి అడుగుపెట్టాడు. మెదట్లో సెంట్లలో భూమిని కోనుగోలు చేసి క్రయ, విక్రయాల ద్వారా రూ.వేలు సంపాదించేవాడు. ఇప్పుడు ఎకరాల్లో భూములు కొంటున్నాడు. ప్లాట్లుగా విభజించి వెంచర్లు వేసి రూ.లక్షలు సంపాదిస్తున్నాడు. ఏ మాయ చేస్తున్నాడోకానీ రూపాయి కూడా ప్రభుత్వానికి పన్నులు చెల్లించకపోవడంతో ఈ సొమ్మంతా వెనకేసుకుంటున్నాడు. దీంతో విలాసవంతమైన భవనం.. పిల్లల కార్పొరేట్ చదువులు.. ఇలా అన్నీ అబ్బాయి.

శృంగవరపుకోట, జూలై 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు ఎక్కువగా ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగుల నుంచి మాత్రమే పక్కాగా పన్నులను వసూలు చేయగలుగుతున్నాయి. వీరు తీసుకుంటున్న ప్రతి రూపాయికి లెక్కలు ఉంటుండడంతో ఆదాయపన్నుల శాఖ అధికారుల నుంచి తప్పించుకునే అవకాశం లేదు. మిగతా వర్గాలు అధికశాతం పన్ను తప్పించుకుంటున్నాయి. ప్రజల నుంచి పన్నుల రూపంలో వసూలు చేసే ఆదాయంతోనే ఏ ప్రభుత్వమైనా నడేచేది. గ్రామ స్థాయి నుంచి జిల్లా వరకు.. అక్కడి నుంచి రాష్ట్రం, దేశం వరకు ప్రజల కట్టే పన్నులతోనే పరిపాలన సాగుతోంది. విజయనగరం జిల్లాలో 2011 జనాభా లెక్కల ప్రకారం 23.44 లక్షల ప్రజలు నివసిస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలకు చెందిన ఉద్యోగులు లక్షల్లో ఉన్నారు. వీరి నుంచి నిబంధనల ప్రకారం పన్నుల రూపంలో ఆదాయం సమకూరుతోంది. అయితే ప్రైవేటు రంగాల్లో వ్యాపార, వాణిజ్యం చేస్తున్న కొందరు మాత్రం ఆదాయం తగ్గించి చూపి తప్పించుకుంటున్నారు. జిల్లాలో చెప్పుకోదగ్గ పెద్ద పరిశ్రమలు లేవుగానీ అక్కడక్కడా చిన్నవి ఉన్నాయి. కొంతవరకు ఖనిజ సంపద ఉంది. ఎక్కువగా వ్యవసాయ ఆధారిత జిల్లా. విశాఖపట్నానికి అనుకుని ఉండడంతో రియల్ ఎస్టేట్ రంగం ఆశాజనకంగా నడుస్తోంది. పల్లెలు, పట్టణాలనే తేడా లేకుండా లేఅవుట్‌లు విస్తరించాయి. సాధారణంగా లేఅవుట్‌ను తీర్చిద్దినప్పుడు వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చాలి. ఇందుకు ప్రభుత్వానికి నిర్దేశిత సొమ్ము చెల్లించాలి. అయితే జిల్లాలోని లేఅవుట్లలో చాలావరకు వ్యవసాయేతర భూమిగా మార్చనవి ఉన్నాయి. ఇలా ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం పక్కదారి పడుతోంది. ఒడొక్కటే కాదు.. భూముల రిజిస్ట్రేషన్ సమయంలో ఆదాయపన్నుల శాఖకు చిక్కకుండా ఉండేందుకు బ్యాంకు ఖాతాల్లో సొమ్మును జమ చేయకుండ నగదుగా తీసుకుంటున్నారు. వీటిని ఆదాయపన్ను లెక్కల్లో చూపించడం లేదు. రిసార్ట్స్, లాడ్జిలు, ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రులు, విద్యాసంస్థలకు సంబంధించి కూడా ఆదాయం లెక్కలో తేడా ఉన్నట్లు విమర్శలు ఉన్నాయి. రోగుల నుంచి, విద్యార్థుల నుంచి ఫీజులు ఆన్‌లైన్‌లో కాకుండా అధికశాతం నగదు రూపంలో తీసుకోవడం వల్ల ఆదాయపన్ను శాఖకు దొరకడంలేదు. వ్యాపార, వాణిజ్యరంగాలకు బహుళ అంతస్థుల భవనాలను నిర్మించారు. ఇంటి నిర్మాణం, సదుపాయాల లెక్కన వీటిని పన్నులు విధించాలి. కానీ వీటి యజమానులు తక్కువగా పన్నులు వేయించుకుంటున్నారు. ఇందుకు కొందరు అధికారులు సహకరిస్తున్నారు. ఇక ఆపార్టీ.. ఈపార్టీ అనే తేడా లేకుండా రాజకీయ నాయకులు సంపాదిస్తున్న దానికి లెక్కలే ఉండవు. ఇలా కొన్నివర్గాల నుంచే ప్రభుత్వాలు పన్నులు ముక్కుపిండి వసూలు చేస్తున్నాయి. నిబంధనల్లోని లొసుగుల ఆధారంగా అధికశాతం మంది ఈ పన్నుల నుంచి తప్పించుకుంటున్నారు. జాతీయ పన్నుల విధానం పారదర్శకంగా ఉండాలని, చెల్లిస్తున్న పన్నులకు తగ్గట్టుగా ప్రభుత్వాలు సౌకర్యాలు కల్పించాలని అధికశాతం మంది కోరుతున్నారు.

**ఆదాయపన్ను విదానం సరళంగా ఉండాలి**

ప్రభుత్వం స్టాంప్ డ్యూటీ తగ్గించింది. రియల్ వ్యాపారం వృద్ధి చేసేందుకు అనుకూలం. ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుంది. సామాన్యులు పన్నులు చెల్లించేందుకే ప్రభుత్వం అనుకూల వాతావరణం కల్పిస్తుంది. అమల్లో లోపాలు ఉన్నాయి. అధికారులు సక్రమంగా వసూలు చేయాలి. పన్నుల విధానం కూడా పారదర్శకంగా ఉండాలి.

- బొబ్బిలి రామకృష్ణ, న్యాయవాది, శృంగవరపుకోట

**ఏటా జూలై 24న జాతీయ దినోత్సవం**

ప్రతిఏటా జూలై 24న జాతీయ ఆదాయ పన్ను దినోత్సవం. భారతదేశ ఆర్థిక చరిత్రలో ముఖ్యమైనది. 1860లో సర్ జెమ్స్ విల్సన్ భారతదేశంలో ఆదాయ పన్నును ప్రవేశ పెట్టిన రోజు. 1922 నాటికి సమగ్ర ఆదాయ పన్ను చట్టం దేశంలో నిర్మాణాత్మక వ్యవస్థగా మారింది. ఈచట్టం క్రమబద్ధమైన పరిపాలనకు పునాది వేసింది. 1924లో సెంట్రల్ బోర్డ్ ఆఫ్ రెవెన్యూయాక్టు ఆదాయ పన్ను చట్టం బలోపేతమైంది. 1946లో గ్రూప్-ఎ అధికారుల నియామకం, 1957లో నాగ్‌పూర్‌లో ఐఆర్ఎస్ (డైరెక్ట్ టాక్సెస్) స్టాఫ్ కాలేజీను స్థాపించడం, ఆతరువాత నేషనల్ అకాడమీ ఆఫ్ డైరెక్ట్ టాక్సెస్‌గా పేరుమార్చడం, వృత్తి పరమైన అభివృద్ధి సాధించడం జరిగిపోయాయి. 1981లో కంప్యూటరీకరణ మొదలైంది. 2009లో ఇ-ఫైల్డ్ పేపర్ రిటర్న్‌ల బల్క్ ప్రాసెసింగ్ నిర్వహించడానికి బెంగళూరులో సెంట్రలైజ్డ్ ప్రాసెసింగ్ సెంటర్ (సీపీసీ) ఏర్పాటు చేశారు. ఆదాయం పన్ను జాతి నిర్మాణంలో కీలకపాత్ర పోషిస్తుంది. సంక్షేమమం, అభివృద్ధికి అవసరమైన ఆదాయం అందిస్తుంది. ఆరోగ్య సంరక్షణ, విద్య, మౌలిక సదుపాయాలు వంటి ముఖ్యమైన సేవలకు ఉపయోగపడుతుంది. ఉద్యోగ అవకాశాలను సృష్టిస్తుంది.

# భూముల కోసం ప్రాణాలైనా ఇస్తాం

● తహసీల్దార్‌కు తేల్చిచెప్పిన కాకర్లవలస గిరిజనులు



గిరిజనులతో మాట్లాడుతున్న తహసీల్దార్ అజురఫీ జాన్

రామభద్రపురం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కాకర్లవలసలో సాగు భూములను ఎంఎస్ ఎంఈ పార్కు కోసం అధికారుల స్వాధీనం చేసుకోవడంపై గిరిజనులు ఆందోళన వ్యక్తం చేశారు. కొన్నేళ్లుగా సాగుచేస్తున్న భూములను ఎక్స్‌కవేటర్లతో దున్నించి స్వాధీనం చేసుకోవడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. ప్రాణాలైనా ఇస్తాం కానీ భూములను వదులుకోం అని గిరిజనులు తేల్చిచెప్పారు. బుధవారం మిర్తివలస సర్పంచ్ మజ్జి రాంబాబు, సీఐటీయూ నాయకుడు బలసా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గిరిజనులు భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము అంతా నిరుపేద గిరిజనులమన్నారు. ఈ భూములు తప్పా మాకు ఎటువంటి ఆధారం లేదన్నారు. వేలాది రూపాయలు మదుపులు పెట్టి ప్రత్తి, మొక్కజొన్న, మామిడి, జీడి తోటలు పెంచుకుంటున్నామన్నారు. ఇలాంటి భూములను లాక్కోవడం సమంజసం కాదన్నారు. కాకర్లవలస, కారేడువలస గ్రామాలకు చెందిన గిరిజనులకు గతంలో సుమారు 365 ఎకరాల డీ పట్టా భూములను పంపిణీ చేశారన్నారు. తమ వద్ద పట్టాలు కూడా ఉన్నాయన్నారు. అదే సమయంలో తహసీల్దార్ అజురఫీ జాన్ అక్కడకు చేరుకుని గిరిజనులతో మాట్లాడారు. భూములను సమగ్రంగా సర్వే జరిపి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. అయితే ఈ భూ ములను ఏపీఎస్ ఐసీడీసీకి గతంలో కేటాయించారన్నారు. ఆ భూములకు సంబంధించిన సర్వే చేయడం వల్లే ఈ సమస్య పరిష్కారం అవుతుందన్నారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ తమ భూముల్లో ఎక్స్‌కవేటర్‌తో దున్నించిన వాటికి నష్టపరిహారం చెల్లించాలన్నారు. ఈ ప్రాంతంలో వందలాది ఎకరాలు డీ పట్టా భూములు ఉన్నాయని, వాటిని ఎంఎస్ఎంఈ పార్కుకు కేటాయించాలన్నారు. ఈ భూములపై మాకు సర్వ హక్కులు ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దానికి విరుద్ధంగా ఇక్కడ ఎక్స్‌కవేటర్లతో పనులు చేస్తే వాటి కింద ప్రా ణాలు విడిచిపెడతామని గిరిజన మహిళ తౌడమ్మ హెచ్చరించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో బొబ్బిలి రూరల్ సీఐ నారాయణరావు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉన్నతాధికారులతో చర్చించి నిర్ణయం తీసు కుంటామని తహసీల్దార్ రఫీ వారికి నచ్చజె ప్పారు. అప్పటి వరకు పనులు నిలుపుదల చేయడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



యంత్రంతో మొక్కలను తొలగించిన దృశ్యం



ఆందోళన చేస్తున్న గిరిజనులు

# బొత్స అసత్య ప్రచారం మానుకోవాలి

● మద్యం కంపెనీల నుంచి భారీగా ముడుపులు
● టీడీపీ జిల్లా అధ్యక్షుడు నాగార్జున



మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు కమిడి నాగార్జున

విజయనగరం, జూలై 23(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో మద్యం అమ్మకాల్లో భారీ కుంభకోణం జరిగిందని, మద్యం కంపెనీల నుంచి ముడుపులు అందాయని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, డీసీసీబీ ఛైర్మన్ కిమిడి నాగార్జున ఆరోపించారు. నాసిరకం, కల్తీ మద్యంతో ఎంతో మంది ప్రాణాలు తీసేసిన ఘనత వైసీపీదేనని విమర్శించారు. మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ, జడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావులు తమ ఉనికిని కాపాడుకోవడం కోసం లేనిపోని ప్రకటనలు చేస్తున్నారన్నారు. బొత్స అసత్య ప్రచారం మానుకోవాలని కోరారు. బుధవారం విజయనగరంలోని టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఐదేళ్లల్లో వైసీపీ ప్రభుత్వం నాసిరకం మద్యంతో భారీ కుంభకోణానికి పాల్పడిందని ఆరోపించారు. మద్యం కుంభకోణంలో భాగస్వామ్యులైన అందరిపైన మర్డర్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టు అన్యాయమని వైసీపీ నాయకులు ప్రకటన సిగ్గుచేటన్నారు. ఇటువంటి భారీ కుంభకోణాలకు పాల్పడితే ఎందుకు అరెస్టు చేయకూడదని మంత్రి బొత్స, జడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావును ప్రశ్నించారు. జిల్లా వ్యాప్తంగా జరిగిన వైసీపీ సభల్లో ఆ పార్టీ నాయకులు అబద్ధాలు, అసత్యాలు మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఐదేళ్లల్లో రాష్ట్రాన్ని ధ్వంసం చేసినందుకే ప్రజలు ఆ పార్టీకి 11 సీట్లలో కూర్చోబెట్టారని చెప్పారు. బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లో 30 ఎకరాల భూమిని రూ.10 లక్షలకు తీసుకున్న సంపన్నులు ఎవరని ప్రశ్నించారు. ఎకరాకు రూ.60 లక్షలు ఇస్తుంటే, అతి తక్కువ ధరకు తీసుకున్నది మీరు కాదా అని వైసీపీ నాయకులను నిలదీశారు. రాష్ట్రంలో గత ప్రభుత్వం 16 మంది ఉపాధ్యాయులను అక్రమ బదిలీ చేసి, ఒక్కక్కరి నుంచి రూ 5 నుంచి 7 లక్షలు వసూలు చేసిందని ఆరోపించారు. 2021-22, 2022-23 విద్యా సంవత్సరాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రూ. 150 కోట్ల విలువల గల రూ.7 లక్షల స్కూల్ బ్యాగ్‌లను అదనంగా కొనుగోలు చేసి నిధులు దుర్వినియోగం చేశారన్నారు. ఇలాంటి కుంభకోణాలకు సమాధానం చెప్పకుండా కూటమి ప్రభుత్వంపై బురద జల్లడం సమంజసం కాదని నాగార్జున పేర్కొన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు షైలిపిల్లి పైడిరాజు, పెనుమత్స శ్రీనివాసరాజు (కింగ్ శ్రీను)లు పాల్గొన్నారు.

# పైడిమాంబ ఆలయ హుండీ లెక్కింపు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

విజయనగరం కల్చరల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): స్థానిక టీటీడీ కళ్యాణ మండపంలో పైడిమాంబ చదురుగుడి, వనంగుడి, అన్నదాన హుండీలను బుధవారం లెక్కించారు. ఈవో శిరీష, సహాయ కమిషనర్ వై.శ్రీనివాసరావు, ఆలయ సూపరింటెండెంట్ ఏడు కొండలు పర్యవేక్షణలో 44 రోజుల తరువాత హుండీ లెక్కింపు చేపట్టారు. చదురుగుడికి సంబంధించి రూ.15 లక్షల 47 వేల 543 నగదు, ఏడు గ్రాముల, 300 మిల్లీగ్రాముల బంగారం, 235 గ్రాముల వెండి, వనంగుడికి సంబంధించి రూ. 3 లక్షల 63 వేల 666 నగదు, అన్నదానానికి సంబంధించి రూ.11, 630 నగదు వచ్చినట్టు అధికారులు తెలిపారు.

# ఆగస్టు 11న స్టాండింగ్ కమిటీ ఎన్నిక

విజయనగరం రింగురోడ్డు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): విజయనగరం నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ ఎన్నికకు నోటిఫికేషన్ విడుదలచేసినట్లు కమిషనర్ పి.నల్లనయ్య తెలిపారు. సంస్థ కార్యదర్శి హోదాలో సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు ఎన్నికకు సంబంధించిన వివరాలను నోటీసు బోర్డులో అతికించారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో- 59 అనుసరించి మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ ఆదేశాల మేరకు ఐదుగురు సభ్యులతో కూడిన స్టాండింగ్ కమిటీ ఎన్నిక ఆగస్టు 11న నిర్వహించనున్నట్లు కమిషనర్ చెప్పారు. బుధవారం ఎన్నిక ప్రకటన వెలువరించామని, గురువారం నుంచి 30వ తేదీ వరకూ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకూ కమిషనర్ లేదా అధీకృత అధికారి సమక్షంలో నామినేషన్ దాఖలు ప్రక్రియ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 31న దాఖలైన నామినేషన్ వివరాలు ప్రకటిస్తామని, ఆరోజు 11 గంటలకు నామినేషన్ల పరిశీలిస్తామని పేర్కొన్నారు. అదే రోజు మధ్యాహ్నం అర్హులైన అభ్యర్థుల వివరాలను ప్రకటిస్తామని తెలిపారు. అదే రోజు సాయంత్రం నాలుగు గంటలకు అభ్యర్థులు తుదిజాబితా ప్రకటిస్తామని తెలిపారు. ఆగస్టు 11న పోలింగు నిర్వహిస్తామని, అదే రోజు ఓట్లు లెక్కించి ఎన్నికైన సభ్యుల వివరాలు ప్రకటిస్తామని పేర్కొన్నారు.

# ఏకధాటిగా..

● జిల్లాలో భారీగా కురిసిన వాన



భామినిలో వర్షం పడుతున్న దృశ్యం



సీతంపేటలో కురుస్తున్న భారీ వర్షం

పాలకొండ, జూలై 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బుధవారం భారీ వర్షం కురిసింది. పాలకొండ పట్టణంలోని మధ్యాహ్నం సుమారు గంటన్నర పాటు ఏకధాటిగా వర్షం పడటంతో రోడ్లు జలమయమయ్యాయి. దీనితో వాహన రాకపోకలకు అంతరాయం కలిగింది. ముఖ్యంగా పట్టణంలోని మెయిన్‌రోడ్డు, వడమ జంక్షన్ వద్ద కాలువలు నిండి రోడ్డుపై మురుగునీరు, వర్షపునీరు ప్రవహించడంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఈ వర్షం ఖరీఫ్ పనులకు ఉపయోగపడుతుందని రైతులు అంటున్నారు.

**భామినిలో..**

భామిని, జూలై 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని బుధవారం బత్తిలి నుంచి బిల్లుమడ వరకు భారీ వర్షం కురిసింది. బిల్లుమడ నుంచి బాలేరు వరకు ఓ మోస్తరుగా వర్షం పడింది. అలికాం-బత్తిలి రహదారి గుంతలో వర్షం నీరు పెద్దఎత్తున చేరడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. గరండి నుంచి బత్తిలి వరకు రోడ్డుపై వరద నీరు చేరింది. వాహనదారులు ఇబ్బంది పడ్డారు. ఇటీవల కురిసిన వర్షాలకు దమ్ము ప్రారంభించిన రైతులకు సాగునీటి సమస్య తీరినట్టయింది.

**సీతంపేటలో..**

సీతంపేట రూరల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): సీతంపేట మన్యంలోని కొన్ని ప్రాంతాల్లో బుధవారం కుండపోత వర్షం కురిసింది. సీతంపేట, కుసిమి, గొయిది, కుడ్డపల్లి, దోనుబాయి, శంబాం, మల్లి, పెదరామ తదితర ప్రాంతాల్లో భారీ వర్షం పడింది. కొద్ది రోజులుగా ఏజెన్సీలో వర్షాలు కురవక గిరిజన రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అయితే బుధవారం కురిసిన కుండపోత వర్షం ఎంతో ఉపయోగకరమని రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

# కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి

● జిల్లా వ్యాప్తంగా సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధిసాధ్యమని టీడీపీ నాయకులు తెలిపారు. బుధవారం జిల్లాలోని పలుచోట్ల తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు.ఈసందర్భంగా కరపత్రాలు అందజేసి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ, చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అనంతరం టీడీపీ నాయకులు మాట్లాడుతూ సూపర్‌సిక్స్ కార్యక్రమాల్లో భాగంగా సామాజిక పింఛన్ల పెంపుదల, తల్లికి వందనం కార్యక్రమాలను అమలు చేసినట్లు తెలిపారు. ఉచిత గ్యాస్ పంపిణీ చేపట్టామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ఆగస్టు 15న ప్రారంభమవుతుందన్నారు.

●విజయనగరం రూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి):జిల్లాలోని నిర్వహిస్తున్న సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమానికి ప్రజల నుంచి అన్యూహ్యస్పందన లభిస్తోందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు నాగార్జున చెప్పారు. విజయనగరంలోని 2, 3, 4 డివిజన్ల పరిధిలోని పూల్‌బాగ్ ఆటోస్టాండ్ ఆవరణలో ఆయాడివిజన్ ఇన్‌చార్జులు ప్రసాదుల ప్రసాద్,వెలిచేటి మణి కుమారి, రొబ్బి వరలక్ష్మి, టీడీపీ నాయకులు కిల్లాన పార్వతీ, మహేశ్వరరావు, గంట్రేటి సన్యాసిరావు ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు.విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు మాట్లాడుతూ, పనిచేసే ప్రభుత్వానికి ప్రజలు సహకరించాలని కోరారు.

●చీపురుపల్లి, జూలై23 (ఆంధ్రజ్యోతి): టీడీపీ హయాంలోనే సంక్షేమ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయని ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు తెలిపారు. బుధవారం రాత్రి పేరిపిలో జరిగిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు, నాయకులు కుచ్చర్లపాటి త్రిమూర్తులరాజు, దన్నాన రామచంద్రుడు, ఎలకల అప్పారావునాయుడు, కోరాడ కోటేశ్వరరావు, మోపాడ తేజేశ్వరరావు, గడే సన్యాసప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

●లక్కవరపుకోట, జూలై 23(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్లలో చేసిన అభివృద్ధి ఏమీలేదని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు.మండలంలోని రంగారాయపురంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కరెడ్ల ఈశ్వరరావు, శ్రీను, గులిపల్లి రామునాయుడు, కాశీవిశ్వనాథం పాల్గొన్నారు.

●నెల్లిమర్ల, జూలై 23(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీలో ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్, నెల్లిమర్ల టీడీపీ ఇన్‌చార్జ్ కర్రోతు బంగార్రాజు ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి అట్టాడ శ్రీధర్, నగర పంచాయతీ ప్రధాన కార్యదర్శి అవనాపు సత్యనారాయణ, కౌన్సిలర్ కింతాడ కళావతి, నాయకులు కలిశెట్టి కన్నంనాయుడు, శంకరరావు, శ్రీను, చందక చిరంజీవి, గౌరి పాల్గొన్నారు.



చీపురుపల్లి: పేరిపిలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కళావెంకటరావు



లక్కవరపుకోట: రంగారాయపురంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి



నెల్లిమర్ల: మహిళకు కరపత్రం అందజేస్తున్న నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు



విజయనగరం రూరల్: మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు నాగార్జున, కార్యక్రమంలో పాల్గొన్న అదితి గజపతిరాజు

## పంటకాలువలో మట్టి తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

భోగాపురం, జూలై23 (ఆంధ్రజ్యోతి): భోగాపురం జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న పంట కాలువలో మట్టిని ఇరిగేషన్ శాఖ డీఈఈ గోవిందరావు స్పందించి ఏఈఈ రమేష్‌చంద్రతో పరిశీలన చేయించి బుధవారం తొలగించేందుకు చర్యలు తీసుకున్నారు. కాలువలో పూడ్చేసిన మట్టిని బయటకు తొలగించారు.ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఈనెల 22న పంటకాలువ పూడ్చేశారు శీర్షికతో కథనం ప్రచురితంకావడంతో స్పందించారు.

## ఎరువుల కొరత లేదు: మంత్రి శ్రీనివాస్

విజయనగరం, జూలై 23 (ఆంధ్రజ్యోతి):జిల్లాలో ఎరువులకు కొరత లేదని,ఈ సీజన్‌లో అవసరమైన ఎరువుల్ని మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు.ఈమేరకు వ్యవసాయశాఖ అధికారులు,ఎరువుల డీలర్లు, కంపెనీల ప్రతినిధులతో పలుసార్లుగా మంత్రి మాట్లాడారు. వ్యవసాయ సీజన్ ప్రారంభం నేపథ్యంలో ఎరువల కొరత ఉందని వస్తున్న వందంతులపై మంత్రి స్పందించి సంబందిత వర్గాలతో మంత్రి చర్చించారు. ఈ మేరకు అవసరమైన ఎరువులు, రైతుభరోసా కేంద్రాలు, సొసైటీల్లో అందుబాటులో ఉన్నాయని మంత్రి తెలిపారు. యూరియా 5,008 మెట్రిక్ టన్నులు, డీఏపీ 2908, పోటాష్ 527, సూపర్ పాస్పేట్ 680 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 2396 టన్నులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. జిల్లాలో ఎరువుల కొరతపై ఇబ్బందులుఎదురైతే జిల్లా వ్యవసాయశాఖ జేడీ ని సంప్రదించాలని సూచించారు. ఎరువులు రైతులకు అందుబాటులో ఉన్నా, కొందరు కావాలనే రైతులను భయభ్రాంతులకు గురిచేసే ప్రచారం చేస్తున్నారని తెలిపారు. దీంతో పాటు ఆర్ఎఫ్ సీఎల్-737 టన్నులు మంగళవారం, సీఐఎల్ నుంచి 634 మెట్రిక్ టన్నుల యూరియా బుధవారం జిల్లాకు చేరిందని మంత్రి చెప్పారు.ఆర్‌సీఎఫ్ నుంచి మరో 7199 మెట్రిక్ టన్నుల యూరియా నేడో,రేపో జిల్లాకు రానుందని తెలిపారు నానోయూరియా, నానో డీఏపీలను కూడా రైతు సేవాకేంద్రాల్లో అందుబాటులో ఉంచినట్లు చెప్పారు.

## ప్రజల తరపున పోరాటం

విజయనగరం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ప్రజల తరుపున పోరాటం ఆగదని వైసీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు తెలిపారు.బుధవారం విజయనగరంలో విలేకరులతో మాట్లాడుతూ ఇచ్చిన హామీలు ఏడాది కాలంలో అమలు కాకపోవడంతో ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుండడంతో వైసీపీ నాయకులను లక్ష్యంగా చేసుకుని అక్రమ కేసులు పెడుతూ, అన్యాయంగా జైలుకు పంపుతున్నారని విమర్శించారు.

## బోధనేతర పనుల నుంచి తప్పించాలి

సంతకవిటి, జూలై 23(ఆంధ్రజ్యోతి); ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి తప్పించాలని యూటీఎఫ్ మండలాధ్యక్షులు బూరాడ శ్రీనివాసం కోరారు.బుధవారం సిరిపురం పాఠశాలల్లో యూటీఎఫ్ నాయకులు సభ్యత్వ నమోదు నిర్వహించారు.

## ప్రహరీ నిర్మించాలి

శృంగవరపుకోట, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఎస్.కోట గిరిజన బాలికల వసతి గృహానికి ప్రహరీ నిర్మించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. బుధవారం తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యురాలు రత్న, జిల్లా ఉపాధ్యక్షుడు చిన బాబు, భారతి, అనిత అందజేశారు.

## బీజేపీని బలోపేతం చేయాలి

విజయనగరం దాసన్నపేట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): బూత్ స్థాయి నుంచి పార్టీని బలపేతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఉప్పలపాటి రాజేష్‌వర్మ కోరారు. బుధవారం విజయనగరంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో పతాధికారులతో సమావేశం నిర్వహించారు.కార్యక్రమంలో నాయకులు లక్ష్మీ నరసింహం, రెడ్డి పావనీ, నారాయణరావు, రాజేష్, రామారావు పాల్గొన్నారు.

## ఆర్టీఐపై అవగాహన

విజయనగరంకలెక్టరేట్, జూలై 23(ఆంధ్రజ్యోతి):జిల్లా సహకార శాఖ అధికారులు, సిబ్బందికి రాష్ట్ర సమాచార కమిషనర్, రాష్ట్ర సహకార సంఘం కమిషనర్ ఆదేశాల మేరకు సమాచార హక్కు చట్టంపై బుధవారం జిల్లా కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీసీవో పి.రమేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎం.వాణిశైలజ ఆర్టీఐ- 2005పై వివరించారు. సదస్సులో డివిజినల్ సహకార అధికారి రామ్మూర్తి, జిల్లా సహకార ఆడిట్ అధికారి సన్యాసినాయుడు పాల్గొన్నారు.

## అనధికార లేఅవుట్ గుర్తింపు

జామి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): జామిలో అనధికారికంగా ఏర్పాటుచేసిన ఓ లేఅవుట్‌ను వీఎంఆర్‌డీఏ అధికారులు గుర్తించారు. జామిలో ఓ వ్యక్తి అనధికారంగా లేఅవుట్ వేయడంతో పాటు కొంతమంది స్థలాలు ఆక్రమించి విక్రయిస్తున్నట్లు వీఎంఆర్‌డీఏ అధికారులకు కొందరు సమాచార చట్టం ద్వారా ఫిర్యాదుచేశారు. ఈనేపథ్యంలో బుధవారం వీఎంఆర్‌డీఏ అధికారులు ఆయా స్థలాలను పరిశీలించారు.ఈ సందర్భంగా కొందరు లేఅవుట్‌పేరుతో తమ భూములు ఆక్రమించి అమ్మేస్తున్నారని ఫిర్యాదుచేశారు. ఈవిషయాన్ని రెవెన్యూ అధికారులు, పోలీస్‌లకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ లేఅవుట్ విషయంపై గ్రామానికి చెందిన న్యాయవాది రమణారావు అధికారులకు వివరించారు. అనధికార లేఅవుట్ అయితే తమ కమిషనర్‌కు విచారణ కోసంవివరాలు అందజేస్తామని, అనంతరం చర్యలు చేపడతామని వారు తెలిపారు.వారి వెంట పంచాయతీ ఈవో ప్రసాద్ ఉన్నారు.

## జగన్‌కు మళ్లీ గుణపాఠం తథ్యం: కళా

రాజాం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ హయాంలో జగన్ అండ్ కంపెనీ ధృతరాష్ట్రుడి పాలనసాగించిందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు తీవ్రంగా విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రాన్ని చేజిక్కించుకోవడానికి విశ్వ ప్రయత్నాలు జగన్ చేస్తున్నాడని, ప్రజలు మళ్లీ గుణపాఠం చెప్పడం తథ్యమని తెలిపారు.బుధవారం రాజాంలో విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నాణ్యత లేని మద్యం సరఫరా చేసి శ్రామికుల రక్తాన్ని పీల్చేశారన్నారు.

## లక్ష్మీసెహగల్ ఆశయాలను ఆచరించాలి

విజయనగరం బాబామెట్ట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధురాలు, మహిళా సమానత్వం కోసం పోరాడిన లక్ష్మీసెహగల్ ఆశయాలను నేటి యువత ఆచరించాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకరరావు కోరారు. విజయనగరంలోని ఎల్‌బీజీ నగర్‌లో లక్ష్మీసెహగల్ 13వ వర్ధంతి పురస్కరించుకుని ఐద్వా జిల్లా కార్యదర్శి రమణమ్మ అధ్యక్షతన వర్ధంతి సభ నిర్వహించారు.

## జేఎస్ఎల్ టీఎన్‌టీయూసీ గౌరవాధ్యక్షుడిగా శ్రీను

కొత్తవలస, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పన్నపాలెం పంచాయతీ పరిధిలో గల జేఎస్ఎల్ కర్మాగారానికి సంబంధించి తెలుగునాడు ట్రేడ్‌యూనియన్ కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడిగా టీడీపీకి చెందిన లెంకశ్రీనును కార్మికులు ఎన్నుకున్నారు. బుధవారం ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి సమక్షంలో ఎన్నిక జరిగింది. ఈ కర్మాగారానికి టీఎన్‌టీయూసీ అధ్యక్షుడిగా కర్మాగారం ఏర్పాటు చేసినప్పటి నుంచి మృతిచెందే వరకూ మాజీ ఎంపీపీ పొలమరశెట్టి రాజన్న ఉన్న విషయం విదితమే.

## పరిసరాలు శుభ్రంగా ఉంచాలి: సీఈవో

శృంగవరపుకోట రూరల్, జూలై 23(ఆంధ్రజ్యోతి):పరిసరాలను పరిశుభ్రంగా ఉంచితే సగం వ్యాధులు అరికట్టినట్లేనని జడ్పీ సీఈవో సత్యనారాయణ తెలిపారు. బుధవారం మండలంలోని అలుగుబిల్లిలో వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా సుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్రకార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్, ఈవోపీఆర్‌డీ లక్ష్మి, కార్యదర్శి అప్పారావు పాల్గొన్నారు.

● శృంగవరపుకోట, జూలై 23 (ఆంధ్రజ్యోతి):ఎస్.కోట పుణ్యగిరి రోడ్డులో గల వైఎస్ఆర్ కాలనీలో బుధవారం సీఈవో సత్యనారాయణ,డీపీవో మల్లిఖార్జున, జిల్లా గ్రామీణ తాగునీటి శాఖ ఎస్ఈ కవిత, డీఈఈ పైడిరాజు, జెఈ కిషోర్, ఎంపీడీవో సతీష్, ఈవోపీఆర్డీ ఐవీ లక్ష్మి పర్యటించి మౌలిక వసతులు పరిశీలించారు.

●డెంకాడ, జూలై 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని పినతాడివాడ పంచాయతీని జిల్లా పంచాయతీ అధికారి డీపీ మల్లిఖార్జునరావు బుధవారం పరిశీలించారు. తొలుత క్లోరినేషన్, ట్యాంకు క్లీనింగ్, శానిటేషన్ రిజిస్టర్లను తనిఖీచేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, కార్యదర్శి టి.వెంకటరావు పాల్గొన్నారు.

## విజయనగరంలో ఆర్మీ సర్వీసెస్ సెలక్షన్ బోర్డును ఏర్పాటు చేయండి

● లోక్‌సభలో టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

న్యూఢిల్లీ, జూలై23(ఆంధ్రజ్యోతి): విజయనగరం లేదా విశాఖపట్నంలో ఆర్మీ సర్వీసెస్ సెలక్షన్ బోర్డు ఏర్పాటుచేయాలని కేంద్రప్రభుత్వానికి టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు విజ్ఞప్తి చేశారు. బుధవారం, లోక్‌సభలో 377 నియమం కింద మాట్లాడిన కలిశెట్టి.. ఎస్ఎస్‌బీ ఏర్పాటుకు భూమి, మౌలిక సదుపాయాలు, కనెక్టివిటీ సులభంగా లభ్యమవుతాయన్నారు.సైన్యంలో ఏపీ ప్రముఖపాత్ర పోషిస్తున్నా రాష్ట్రంలో ఎస్ఎస్‌బీ లేదని,దీంతో ఎన్‌డీఏ, సీడీఎస్ వంటి పరీక్షలలో ఉత్తీర్ణత సాధించిన రాష్ట్ర యువత ఇంటర్వ్యూ కోసం అలహాబాద్, బెంగళూరు వెళ్తున్నారని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే ఆర్థికంగా బలహీనంగా ఉన్న అభ్యర్థులపై ఆర్థిక భారం, దూర ప్రయాణ భారం పడుతుందన్నారు. దీంతో యువత దరఖాస్తు చేసుకోవడంలో వెనుకంజవేస్తున్నారని చెప్పారు. కాబట్టి ఏపీలో ఎస్ఎస్‌బీ ఏర్పాటు చేస్తే పొరుగు రాష్ట్రాలైన ఒడిశా, ఛత్తీస్‌గఢ్ అభ్యర్థులకు కూడా ప్రయోజనకరంగా ఉంటుందని ఎంపీ కలిశెట్టి చెప్పారు.

## అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

విజయనగరం క్రైం, జూలై23 (ఆంధ్రజ్యోతి):అగ్ని ప్రమాదాల నివారణపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకొని అప్రమత్తంగా ఉండాలని జిల్లా అగ్నిమాపక సహాయ అధికారి సోమేశ్వరరావు పిలుపునిచ్చారు. బుధవారం విజయనగరంలోని ఫోర్టుసిటీ పాఠశాలలో ఫైర్ మాక్‌డ్రిల్ నిర్వహించి, ప్రమాదాలు జరిగే సమయంలో తీసుకోవలసిన మెళకువలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేపీ రాజు, చంటి, రోహిణాఖాన్, డైరెక్టర్ మధు, అశోక్, నీలిమ పాల్గొన్నారు.

## 50 కుటుంబాలు జనసేనలో చేరిక

భోగాపురం,జూలై23(ఆంధ్రజ్యోతి):ముంజేరు జనసేన పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే లోకం నాగమాధవి ఆధ్వర్యంలో బుధవారం పూసపాటిరేగ మండలం తొట్టడంలోని వైసీపీకి చెందిన 50 కుటుంబాలు పార్టీలో చేరాయి. వైసీపీ నాయకులు పనితీరు, గత ప్రభుత్వ పరిపాలన నచ్చక జనసేనలో చేరినట్లు గౌరీ రెడ్డి, తదితరులు తెలిపారు.

## బొద్దాం పాఠశాలకు పురస్కారం

వేపాడ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొద్దాం జడ్పీ ఉన్నత పాఠశాలకు అభినందన పురస్కారం లభించింది. 2024-25 విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షకు హాజరైన 15 మంది ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులుకావడతో పాఠశాలకు కలెక్టర్, రీజినల్ జాయింట్ డైరెక్టర్ జిల్లా విద్యాశా ఖాధికారుల ద్వారా అభినందన పురష్కారం అందుకున్నారు. మేరకు పలువురు హెచ్‌ఎం,సిబ్బందిని తదితరులు అభినందించారు.

## ప్రకటన జారీచేసి ప్రచారం నిర్వహించి..

●కొత్తవలస ఉన్నతపాఠశాలలో విద్యార్థి ప్రతినిధుల ఎన్నిక



విద్యార్థి ప్రతినిధుల ఎన్నికల వల్ల కోలాహలంగా మారిన పాఠశాల ప్రాంగణం

కొత్తవలస, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : కొత్తవలస జడ్పీ ఉన్నతపాఠశాలలో విద్యార్థి ప్రతినిధుల ఎన్నిక సాధారణ ఎన్నికలు తలపించే విధంగా బుధవారం మధ్యాహ్నం నిర్వహించారు.తొలుత ఎన్నికల ప్రకటన జారిచేసి, పోటీ చేసే అభ్యర్థుల నుంచి డిపాజిట్ వసూలు చేశారు. అనంతరం ఎన్నికల ఏజెంట్ల నియామకం, ప్రచార కార్యక్రమం, ఓటింగ్, కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించారు. సాధారణ ఎన్నికలు ఎలా జరుగుతాయన్న విషయాన్ని ప్రత్యక్షంగా విద్యార్థులకు తెలియజేసేందుకు ఏర్పాటు చేసినట్లు హెచ్‌ఎం ఈశ్వరరావు తెలిపారు. ఎన్నికల అధికారులుగా బండారు మోహనరావు, వి.అప్పారావు, పి.నరసమ్మలు వ్యవహరించారు.

## పోస్టాఫీసుల్లో ఇంటర్నెట్ సేవలు

భోగాపురం, జూలై 23(ఆంధ్రజ్యోతి): అన్ని పోస్టాఫీసుల్లో త్వరలో ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి రానున్నాయని తపాలాశాఖ జిల్లా అసిస్టెంట్ సూపరింటెండెంట్ సి.సుందరనాయుడు తెలిపారు. బుధవారం భోగాపురం సబ్ పోస్టాఫీసు కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్టాఫీసుల్లో ఈనెల ఎనిమిదో తేదీనుంచి అడ్వాన్స్ పోస్టల్ టెక్నాలజీతో సేవలు మెరుగుపడ్డాయని చెప్పారు. కార్యక్రమంలో సబ్‌పోస్టుమాస్టర్ టీవీ రమణ పాల్గొన్నారు.

## 108 శివలింగాలకు పూజలు

కొత్తవలస, జూలై 23 (ఆంధ్రజ్యోతి): తుమ్మికాపల్లి రైల్వేగేట్ సమీపంలో గల ఓం సదనంలోఆషాడ మాసం మాస శివరాత్రి పురస్కరించుకుని 108 శివలింగాలకు బుధవారం మహాన్యాసపూర్వక రుద్రాభిషేకాలను నిర్వహించారు. ఈసందర్భంగా సదనంలో గల యాగశాలలో హోమాలను చేశారు.

**రావి చెట్టుకు చీరకట్టి పూజలు చేసి..**

కొత్తవలస-శృంగవరపుకోట రోడ్డులోని పశు సంర్ధకశాఖ ఏడీ కార్యాలయం సమీపంలో రావి చెట్టును మహావిష్ణువు అవతారంగా భక్తులు కొలుస్తుంటారు. ఈ చెట్టు పుచ్చిపోవడంతో కొద్ది రోజుల కిందట మొదలువరకువిరిగిపోయింది. విరిగిపోయిన రావి చెట్టు మొదలు నుంచి మళ్లీ చిగురు పెట్టడంతో చెట్టుకు పూజలు చేశారు. విరిగిపోయిన మొదలు చుట్టూ సిమెంట్ దిమ్మ కట్టారు. రావి చెట్టును మహిళామూర్తిగా కొలిచి చీరకట్టారు.చెట్టు మొదలులో లక్ష్మి దేవి విగ్రహాన్ని ఏర్పాటుచేసి పూజలు చేశారు.

## అశోక్‌ను కలిసిన శిష్టకరణ సంఘం ప్రతినిధులు



అశోక్ గజపతిరాజుతో మాట్లాడుతున్న జిల్లా శిష్టకరణ సంఘం ప్రతినిధులు

విజయనగరం దాసన్నపేట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): గోవా గవర్నర్‌గా కేంద్రమాజీ మంత్రి అశోక్ గజపతి రాజు నియమితులుకావడంతో శిష్టకరణ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంపీజీ ఈశ్వరరావు ఆధ్వర్యంలో సంఘ ప్రతినిధులు బుధవారం మర్యాదపూర్వకంగా ఆయన నివాసంలో కలిశారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా అశోక్ గజపతిరాజుకు నోట్ పుస్తకాలు, పెన్నులను అందించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు రేగా సురేష్, ఎంపీ తిరుపతిరావు, సింహగిరి పట్నాయక్, వాసు పాల్గొన్నారు.

## భూములు అప్పగించండి



మురళికి వినతిపత్రం అందజేస్తున్న నిర్వాసితులు

శృంగవరపుకోట జూలై 23 (ఆంధ్రజ్యోతి):భూములు అప్పగించాలని జిందాల్ భూ నిర్వాసితులు డిమాండ్ చేశారు. బుధవారం ఎస్.కోట తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి, కేఆర్‌సీసీ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ మురళికి వినతిపత్రం అందించారు. జిందాల్‌నిర్వాసితుల తరపున సీపీఎంనాయకుడు జగన్ సమస్యలను వివరించారు.

కాగా నష్టపరిహారం అందని అర్హులైన భూనిర్వాసితులను గుర్తించాలని కలెక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆదేశాలు జారీచేశారని కేఆర్‌సీసీ ప్రత్యేక ఉప కలెక్టర్ మురళి తెలిపారు. ఎస్.కోట తహసీల్దార్ శ్రీనివాసరావుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. పరిహారం కోసం కలెక్టర్‌కు భూ నిర్వాసితుల నుంచి కొన్ని దరఖాస్తులు అందాయని చెప్పారు. తనకు11 దరఖాస్తులు ఇచ్చారని, వీటిని పరిశీలిస్తున్నానని తెలిపారు. అర్హుల నిర్ధారణ చేసిన తరువాత కలెక్టర్‌కు నివేదిస్తానని పేర్కొన్నారు. జిందాల్ భూ నిర్వాసితుల్లో కొందరు తమ భూములను తిరిగి ఇచ్చేయాలని, మరి కొందరు నష్టపరిహారం ఇవ్వాలని కోరుతున్నారని తెలిపారు. వీరి విన్నపాలను కలెక్టర్ దృష్టిలో పెడతానని చెప్పారు.

## వేర్వేరు చోట్ల ఇద్దరి ఆత్మహత్య

జిల్లాలో వేర్వేరు చోట్ల బుధవారం ఇద్దరు వ్యక్తులు ఆత్మహత్యకు పాల్పడ్డారు.ఈమేరకు ఆయా గ్రామాల్లో విషాదఛాయలు అలముకున్నాయి.

**గుడివాడలో విద్యార్థి..**

భోగాపురం, జూలై23(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడివాడకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి సరగడ లక్ష్మణ్‌దీప్ (14) బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సీఐ కె.దుర్గాప్రసాద్‌రావు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. లక్ష్మణ్‌దీప్ తండ్రి సరగడ ఎల్లయ్యరెడ్డి సమీప పరిశ్రమలో, తల్లి సుజాత తగరపువలస సమీప ప్రైవేటు ఆసుపత్రిలో పని చేస్తున్నారు. తల్లిదండ్రులు ఇద్దరు పనులకు వెళ్లిపోయారు.కుమారుడు లక్ష్మణ్‌దీప్ ఉదయం పాఠశాలకు వెళ్లకుండా భీమిలి మండలంలోని చిప్పాడలోని ఆలయానికి వెళ్లాడు. విధులు ముగించుకొని తండ్రి ఎల్లయ్యరెడ్డి ఇంటికి మధ్యాహ్నం వచ్చే సరికి లక్ష్మణ్‌దీప్ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని కనిపించాడు. దీంతో స్థానికుల సహాయంతో కిందకి దించి హుటాహుటిన తగరపువలసలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు లక్ష్మణ్‌దీప్ మృతి చెందినట్లు నిర్ధారించారు.లక్ష్మణ్‌దీప్ తగరపువలసలోని ప్రైవేటుపాఠశాలలో చదువుతున్నాడు. బాలుడుకు అకఉంది. లక్ష్మణ్‌దీప్ మృతితో గుడివాడలో విషాదం నెలకొంది. తండ్రి సరగడ ఎల్లయ్యరెడ్డిఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తునకు ఎస్ఐ సూర్యకుమారికి అప్పగించినట్లు సీఐ కె.దుర్గాప్రసాద్‌రావు తెలిపారు.

**మద్యానికి బానిసై యువకుడు..**

రాజాం రూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రాజాం పట్టణంలోని కుమ్మరి వీధికి చెందిన మొండి విశ్వేశ్వరరావు (41) ఈనెల 22న రాత్రి ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆత్మహత్యకు పాల్పడిన విషయాన్ని బుధవారం ఉదయం గుర్తించిన విశ్వేశ్వరరావు తల్లి దమయంతి విషయాన్ని పోలీసులకు సమాచారం అందజేసింది. మద్యానికి బానిసై మనస్థాపంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు తల్లి దమయంతి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. రాజాం పోలీసులు కేసు నమోదు చేశారు.

## సువర్ణముఖిలో వృద్ధుడి మృతి

బలిజిపేట, జూలై23(ఆంధ్రజ్యోతి): పదమాయవలసకు చెందిన తట్టుకోట సత్యంనాయుడు (82) సువర్ణముఖినదిలో గల్లంతై మృతిచెందాడు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీ రవుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. సత్యంనాయుడు స్నానం చేసేందుకు మంగళవారం సువర్ణముఖి నదికి వెళ్లాడు. స్నానం చేస్తున్న సమయంలో ఒక్కసారిగా పెరిగిన నీటి ప్రవాహానికి కొట్టుకుపోయాడు. నదిలో గల్లంతైన సత్యంనాయుడు బుధవారం నారాయణపురం వంతెన సమీపంలో తేలియాడుతూ విగతజీవిగా కనిపించాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య సరస్వతమ్మ ఫిర్యాదు మేరకు బలిజిపేట పోలీసులు కేసు నమోదుచేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు.

## చోరీ కేసులో ఇద్దరికి జైలు శిక్ష

జామి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): జామిలో 2019లో జరిగిన బంగారం చోరీ కేసులో ఇద్దరికి ఎస్.కోట న్యాయస్థానం న్యాయాధికారి కనకలక్ష్మి రెండుసంవత్సరాల ఐదునెలల కారాగారశిక్షతోపాటు 1,500 జరిమాన విధించినట్లు ఎస్ఐ వైవీ జనార్దన్ బుధవారం తెలిపారు. 2019లో స్థానిక దొండపర్తి జంక్షన్‌లో నివాసముంటున్న కొలపర్తి సత్యవతి ఇంట్లో తొత్తడి శంకర్, శెట్టి అప్పలరాజు ఆరుతులాల బంగారం చోరీచేశారని అప్పట్లో ఎస్ఐ లోవరాజు కేసునమోదు చేసినట్లు చెప్పారు. దర్యాప్తు అనంతరం వారిని 2022లో అప్పటి ఎస్ఐ జి.వీరబాబు పట్టుకొని వారి వద్ద చోరీ సొత్తు రికవరీ చేశారని తెలిపారు.ఈ మేరకు దర్యాప్తుపూర్తిచేసి పూర్తి ఆధారాలతో చార్జిషీట్‌ను ఏపీపీ రమణ ఆధ్వర్యంలో అందజేయగా న్యాయాధికారి శిక్ష విధించారని చెప్పారు.

## కోటగండ్రేడులో పిడుగుపాటుకు ఆవు మృతి

గుర్ల, జూలై 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటగండ్రేడులో బుధవారం సాయంత్రం పిడుగుపడి ఆవు మృతి చెందింది. ముద్దాడ అప్పలనాయుడు పశువుల శాల వద్ద మధ్యాహ్నం వర్షం కురిసిన సమయంలో పిడుగుపడి ఆవు మృతి చెందగా, అక్కడి చెట్లు కాలిపోయాయి. రూ.40వేల విలువగల ఆవు మృతిచెందడంతో రైతు అప్పలనాయుడు లబోదిబోమంటున్నారు.

## 88 లీటర్ల సారా స్వాధీనం

పాలకొండ, జూలై23 (ఆంధ్రజ్యోతి): నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా పాలకొండ ఎక్సైజ్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. దాడుల్లో వీరఘట్టం బీసీ కాలనీకి చెందిన గొర్లె రాణి 80 లీటర్ల సారా, పనసనందివాడ గ్రామానికి చెందిన బొమ్మాళి డానియేలును 8 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు పాలకొండ ఎక్సైజ్ సీఐ కె.సూర్యకుమారి తెలిపారు. వారిని జేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపరిచామన్నారు.

## శక్తి వారియర్ బృందాలను నియమించాలి: ఏఎస్పీ

విజయనగరం క్రైం, జూలై 23 ( ఆంధ్రజ్యోతి): జిల్లాలోని విద్యా సంస్థల్లో శక్తి వారియర్స్ బృందాలు నియమించాలని జిల్లా అదనపు ఎస్పీ సౌమ్యలత పోలీసు అధికారులను ఆదేశించారు. బుధవారం ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాలతో జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజలకు మహిళల భద్రత, శక్తి యాప్‌పై అవగాహన కల్పిస్తున్న ఐదు టీమ్స్ పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా శక్తి బృందాల చేయాల్సిన విధులను వివరించారు. సమావేశంలో మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ గోవిందరావు, ఇన్‌స్పెక్టరు నరసింహమూర్తి, ఎస్ఐలు శిరీష, దేవి, సాగర్‌బాబు, గోపాలరావు, చంద్రా పాల్గొన్నారు.

## జీవో-30 అమలు చేయాలి: ఆర్డీవో

రాజాం, జూలై 23 (ఆంధ్రజ్యోతి):జీవో -30 అమలుచేసేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీవో ఎ.ఆశయ్య ఆదేశించారు. బుధవారం రాజాం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ డిపట్టా, బం జరు, గ్రామకంఠంలో ఎవరైనా 2019 లోపు ఇళ్లు నిర్మించిన వారికి హక్కు పత్రాలివ్వాలని ఆదేశించారు.కార్యక్రమంలో రాజాం, వంగర,రేగిడి, సంతకవిటి తహసీలార్లు ఎం.రాజశేఖర్, రమణరావు, కృష్ణలత, సుదరనరావు, కమిషనర్ జె.రామప్పలనాయుడు, ఎంపీడీవో శ్రీనివాసరావు, డీటీ ప్రకాష్ పాల్గొన్నారు

## సీజ్ చేసిన షాపు అద్దెకు ఇచ్చేశాడు


● సంతకవిటి పోలీస్‌స్టేషన్‌లో దేవదాయశాఖ ఈవో ఫిర్యాదు



షాపు సీజ్‌చేస్తున్న అధికారులు

రాజాం రూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి):ఓ ప్రభుత్వఉద్యోగి దేవదాయశాఖ భూమిలో నిబంధనలు అతిక్రమించి షాపు నిర్మించి అద్దెకిచ్చాడు. కొద్దిరోజుల జరుగుతున్న ఈ తంతును దేవదాయశాఖ అధికారుల దృష్టికి వెళ్లింది. దీంతో ఆ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కె.శిరీష ఆధ్వర్యంలో ఈవోలు బీవీమాధవరావు, పొన్నాడ శ్యామలరావు, సిబ్బంది అక్రమంగా చేపట్టిన షాపును ఈనెల 22నసీజ్‌చేశారు.రాజాంలోని ఉమామహేశ్వర, లక్ష్మీనారాయణస్వామి ఆలయాలకు చెందిన భూముల్లో రేగిడి మండలంలోని ఓ ఉపాధ్యాయుడు షాపును అక్రమంగానిర్మించారు.దీంతో ఏసీ శిరీషసమ క్షంలో ఈనెల 22న సీజ్‌చేశారు. బుధవారం ఉదయం సీజ్‌చేసిన షాపు తిరిగితెరిచినట్లు అధికారులు గుర్తించారు.ఏసీశిరీష ఆదేశాలమేరకు ఆయనపై సంతకవిటి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు.కాగా, ఇదేప్రాంతంలో గతంలో నిర్మించిన మరో తొమ్మిదిషాపుల్లో వ్యాపారాలు నిర్వహిస్తున్న వారికి 15 రోజుల్లో ఖాళీచేయాలని నోటీసులు అందజేశారు.

## శాకంబరీగా పైడితల్లమ్మ



శాకంబరి అలంకారంలో దర్శనం ఇస్తున్న కొత్తూరు పైడితల్లమ్మ తల్లి

శృంగవరపుకోట రూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరు గ్రామస్థ ఇలవేల్పు పైడితల్లమ్మతల్లికి ఆషాడం పురస్కరించుకుని శాకంబరిగా అలంకరించారు.ఈసందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

●జామి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): జామిలో ఎల్లారమ్మతల్లిను కూరగాయాలతో ఈవో ప్రసాద్ ఆధ్వర్యంలో శాకంబరిగా అలంకరించారు.

# మైనర్ ఇరిగేషన్ గణనపై శిక్షణ

బొబ్బిలి రూరల్, జూలై23 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో బుధవారం మైనర్ ఇరిగేషన్ గణన, నీటి సంఘాలపై బుధవారం వీఆర్వోలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. డిప్యూటీ స్టాటస్టికల్ అధికారి ఎం.భానుమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణను తహసీల్దార్ ఎం.శ్రీను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా భానుమూర్తి మాట్లాడుతూ మైనర్ ఇరిగేషన్ గణన వల్ల రా నీటి వనరుల వినియోగం, నిర్వహణలో మెరుగైన పద్ధతుల ను అనుసరించడానికి అవకాశం ఉంటుంద న్నారు. మండలంలో స్థిరమైన ప్రణాళిక కోసం విశ్వసనీయ డేటాను అందించడానికి క్షేత్రస్థాయిలో సిబ్బంది చురుగ్గా పాల్గొనాలన్నారు. అనంతరం తహసీల్దార్ శ్రీను మాట్లాడుతూ మైనర్ ఇరిగేషన్ ప్రాధాన్యత తెలియజేస్తూ గణన సకాలంలో పూర్తి చేయాల్సి ఉంటుందని ఆదేశించారు. ఈ గణనకు ఎన్యూమరేటర్లుగా వీఆర్వోలు వ్యవహరిస్తారన్నారు. సూపర్‌వైజర్లుగా మున్సిపల్ కార్యాలయ మేనేజర్, టీపీవో, సర్వేయర్, హెచ్‌డీటీ, ఏఎస్‌వో, ఎంఆర్‌ఐలు వ్యవహరిస్తారన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ స్టాటస్టికల్ అధికారి సురేష్, ఈడీటీ గౌరీశంకరరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎస్‌వో భానుమూర్తి

## అం'డర్' బ్రిడ్జిలు

(ఐదో పేజీ తరువాయి)

ఎప్పుడు వస్తామో తెలియని పరిస్థితి నెలకొందంటున్నారు. ఈ అండర్‌బ్రిడ్జికి సంబంధించి ఒకవైపు నుంచి మరోవైపు వెళ్లాలంటే కనీసం అరకిలోమీటరు నడవాల్సి ఉంది. దీంతో వృద్ధులు, చిన్న పిల్లలు, మహిళలు నానా అవస్థలు పడుతున్నారు. ఈ అండర్ బ్రిడ్జి ఉంటునే రైల్వే లైన్‌లపై ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని పలుమార్లు స్థానికులు ఆందోళనలు చేశారు.

**మంగళపాలెం అండర్ బ్రిడ్జి మరీ దారుణం**

మంగళపాలెం గ్రామంలోకి జంక్షన్ నుంచి వెళ్లాలంటే 100 అడుగులు నడిస్తే చాలు. గతంలో ఇక్కడ రైల్వేగేట్ ఉండేది. గేట్ తీయగానే నేరుగా ఊర్లోకి వెళ్లి పోయేవారు. అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేసిన తరువాతే అసలు కష్టాలు మొదలయ్యాయి. 100 అడుగుల దూరంలో ఉన్న ఊర్లోకి ఇప్పుడు వెళ్లాలంటే కనీసం ఐదు కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తోంది. ఊరు ఒకదగ్గరుంటే అండర్ బ్రిడ్జి ఒక దగ్గర ఉంది. దీంతో తమకు నడచి వెళ్లడానికి కనీసం ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని గ్రామస్థులు ఆందోళన చేస్తూనే ఉన్నారు. ఇటీవల సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి అచ్చెన్నాయుడుకు ఇదే సమస్య చెప్పడంతో ఆయన ఒకింత ఆశ్చర్యానికి గురయ్యారు. వెంటనే కేంద్రమంత్రి రామ్మోనాయుడు దృష్టికి తీసుకెళ్లి ఎలాగైనా సమస్యను పరిష్కరించాలని సూచించారు. ఇక నిమ్మలపాలెం అండర్ బ్రిడ్జికి సంబంధించి ఏవైపు నుంచి ఏ వాహనం వస్తుందో తెలియక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దేశపాత్రునిపాలెం, కొత్తూరు కంటకాపల్లి అండర్ బ్రిడ్జిల వద్ద కూడా ఇవే సమస్యలున్నాయి. రాయపురాజుపేట, అద్దూరువానిపాలెం గ్రామాల వద్ద ఇంకా రైల్వేక్రాసింగ్‌లు కొనసాగుతున్నాయి.

**కొత్తవలస మాటేంటి?**

మంగళపాలెం గ్రామస్థులకు మంత్రి అచ్చెన్నాయుడు మాటిచ్చారు. మరి కొత్తవలస ప్రజలు అంతకంటే ఎక్కువ ఇబ్బందులు పడుతున్నారు. వీరి పరిస్థితేంటని జిల్లా సీపీఎం కార్యవర్గ సభ్యుడు గాడి అప్పారావు, శృంగవరపుకోట నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి డేగల అప్పలరాజు ప్రశ్నించారు. కొత్తవలసలో కూడా రైల్వేలైను దాటుకుని వెళ్లేందుకు పాదచారులకోసం ఫుట్‌ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

## అంకితభావంతో విధులు నిర్వర్తించండి

(ఐదో పేజీ తరువాయి)

స్టేషన్‌లో విధులు, రికార్డుల నిర్వహణ, స్థానిక చట్టాలు, భౌగోళిక పరిస్థితులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రొబేషనరీ సమయంలో సీనియర్లు, సహచర ఉద్యోగులు, ప్రజలతో విశ్వాసపూర్వక సంబంధాలు ఏర్పరచుకోవాలని, అప్పుడే సమర్థ పోలీసింగ్ సాధ్యమవుతుందన్నారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు ఎస్పీలు మహేశ్వరరెడ్డి, మాధవరెడ్డి, వకుల్‌జిందాల్, అమిత్‌బర్దర్ ప్రొబేషనరీ ఎస్‌ఐలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రాక్టికల్ శిక్షణ కోసం శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, అల్లూరి జిల్లాలకు పది మంది చొప్పున, విజయనగరం జిల్లాకు తొమ్మిది మందిని కేటాయించారు.

## ట్రాలీ సూట్‌కేసులో గంజాయి

(ఐదో పేజీ తరువాయి)

నాగ్‌పై ఇప్పటికే పలు గంజాయి కేసులు ఉన్నాయి. గంజాయి వ్యాపారం చేస్తున్న క్రమంలో చంద్రకరుణ్, ప్రదీప్‌నాయక్‌లతో పరిచయం ఏర్పడింది. వీరిని గంజాయి అక్రమ రవాణాకు ఉపయోగిస్తున్నాడు. పితాంబర్‌నాగ్ ప్రతి ట్రిప్పుకి వీరికి రూ.5 వేలు చొప్పున చెల్లిస్తున్నట్టు విచారణలో తేలింది. పితాంబర్ ఒడిశా రాష్ట్రం భవానీపట్టణానికి చెందిన జైదర్ అలియాస్ తామోతర్ అనే వ్యక్తి వద్ద నుంచి కిలో రూ.5 వేలు చొప్పున 30 కిలోల గంజాయిని రూ.లక్ష 50 వేలకు కొనుగోలు చేసినట్టు విచారణలో తేలింది. తామోతర్‌ను అరెస్టు చేసేందుకు చర్యలు చేపడుతున్నట్టు డీఎస్పీ తెలిపారు. విలేకరుల సమావేశంలో వన్‌టౌన్ సీఐ ఆర్‌వీఆర్‌కె చౌదరి, టాస్క్‌ఫోర్సు సీఐ బంగారుపాప, ఎస్‌ఐ రామ్‌గణేష్, ఏఎస్‌ఐ రామలక్ష్మి, పీసీలు గౌరీశంకర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలంతా వస్తున్నారా?

(ఐదో పేజీ తరువాయి)

ఒక అంగన్వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. చలుమూరివానిపాలెంలో 40 కుటుంబాలు, వారాదికొంపలో 18 కుటుంబాలు, చిననల్లబిల్లి గ్రామంలో 27 కుటుంబాలు ఉన్నట్టు రికార్డుల్లో చూపిస్తున్నప్పటికీ ఇద్దరే చిన్నారులు అంగన్వాడీకి వస్తున్నారని సిబ్బంది చెబుతున్నారు. ఈ మూడు గ్రామాల్లో ఒక గర్భిణి, ఒక బాలింత కూడా లేరని చెబుతున్నారు. అన్ని కేంద్రాల మాదిరి ఈ కేంద్రంలోనూ పోషకాహారం అందించేందుకు, చిన్నారుల ఆలన పాలన చూడటానికి ఒక కార్యకర్తను, ఆయాను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కేంద్రం వసతి కోసం అద్దె భవనాన్ని కూడా చూసింది. నిర్వహణ చూస్తే లోపభూయిష్టంగా ఉంది. మరికొన్ని గ్రామాల్లో ఇద్దరు, ముగ్గురు పిల్లలతో కేంద్రాలు నడుస్తున్నా ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారులు కాని, పర్యవేక్షకులు కాని దృష్టిసారించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇదే విషయమై నీలకంఠరాజపురం సెక్టారు సూపరవైజర్ భాగ్యవతిని వివరణ కోరగా సెక్టారు పరిధిలోని 26 అంగన్వాడీ కేంద్రాల్లో 305 మంది పిల్లలు ఉన్నారని, చలుమూరివానిపాలెం కేంద్రంలో ఇద్దరే పిల్లలు ఉండగా ప్రస్తుతం ఈ కేంద్రానికి ఒక్క చిన్నారే హాజరవుతున్నట్టు ఆమె ధ్రువీకరించారు.

## ప్రాజెక్టులకు నిధులు

(ఐదో పేజీ తరువాయి)

పరిధిలో కాలువల పరిస్థితి దయనీయంగా మారింది. శివారు భూములకు సాగునీరు అందడం గగనమైపోయింది. ఈ క్రమంలో ఏటా రైతులు వరుణుడిపై ఆధారపడి సాగు చేసుకోవాల్సి వస్తోంది. వారి కష్టాలను పరిగణనలోకి తీసుకున్న కూటమి ప్రభుత్వం జిల్లాలో వెంగళరాయసాగర్, పెద్దగెడ్డ, పెదంకలాం, వట్టిగెడ్డ ప్రాజెక్టుల పరిధిలో తాత్కాలిక పనులు చేయాలని సంకల్పించింది. ఇందుకు గాను ఆపరేషన్ అండ్ మెంటైనెన్స్ (ఓఅండ్ఎం) కింద రూ.2.61 కోట్లు మంజూరు చేసింది. ప్రస్తుతం ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణలో సాగునీటి ప్రాజెక్టు కమిటీల ద్వారా పనులు చురుగ్గా జరుగుతున్నాయి. జిల్లాలో ఇప్పటికే జంఝావతి, వెంగళరాయసాగర్ ప్రాజెక్టుల నుంచి నీటి పారుదలశాఖ అధికారులు సాగునీటిని విడుదల చేశారు.

**మండలాల వారీగా..**

పార్వతీపురం మండలంలో 13 పనులకు గాను రూ. 29 లక్షలు, సీతానగరంలో 14 పనులకు రూ. 41 లక్షలు, బలిజిపేటలో 13 పనులకు రూ. 29 లక్షలు, సాలూరులో రెండు పనులకు రూ. 5.96 లక్షలు, మక్కువలో ఆరు పనులకు రూ. 25.94 లక్షలు కేటాయించారు. కురుపాం మండలంలో ఒక పనికి రూ. 8.5 లక్షలు, గుమ్మలక్ష్మీపురంలో ఒక పనికి రూ. 2.5 లక్షలు మంజూరయ్యాయి. జియ్యమ్మవలస మండలంలో 14 పనులకు రూ. 39.02 లక్షలు, కొమరాడలో రెండు పనులకు రూ. 5 లక్షలు, వెంగళరాయసాగర్, పెద్దగెడ్డ ప్రాజెక్టుల పరిధిలో ఉన్న విజయనగరం జిల్లా బొబ్బిలి మండలంలో 17 పనులకు రూ. 62 లక్షలు, రామభద్రపురంలో ఏడు పనులకు రూ. 13 లక్షలు మంజూరు చేశారు.

**నిధులు మంజూరయ్యాయి**

సాగునీటి ప్రాజెక్టుల పరిధిలో అవసరమైన పనులకు గాను ప్రభుత్వం రూ. 261.10 లక్షలు మంజూరు చేసింది. చురుగ్గా పనులు జరుగుతున్నాయి. ఈ నెలాఖరులోగా 90 పనులు పూర్తి చేయాల్సి ఉంది.

- ప్రదీప్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్,
నీటి పారుదలశాఖ, పార్వతీపురం మన్యం

## ప్రభుత్వ పాఠశాలకు హడ్కో వితరణ

గజపతినగరం జూలై23(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాలకు హడ్కో విజయవాడ ప్రాంతీయ కార్యాలయం సీఎస్‌ఆర్ నిధుల నుంచి లక్షా 75 వేలు విలువ చేసే ఫర్నీచర్‌ను అందజేసినట్లు హెచ్‌ఎం మీసాల వెంకటేశ్వరరావు బుధవారం తెలిపారు. బెంచీలు, కుర్చీలు, టేబుళ్లు 20 చొప్పున, ఆరు ఫ్యాన్లను అందజేసినట్లు చెప్పారు. తమ అభ్యర్థనను పరిశీలించి విలువైన ఫర్నీచర్‌ను అందజేసిన హడ్కోకు ఎంఈవోలు ఎస్. విమలమ్మ, చక్రధరరావుతోపాటు ఉపాధ్యాయులు అభినందించారు.

## ఎన్‌పీసీఐ లింక్ తప్పనిసరి

డెంకాడ, జూలై 23(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవకు సంబంధించి బ్యాంకు అకౌంట్‌కు ఎన్‌పీసీఐ లింక్ లేనివారి రైతుల జాబితా రైతు సేవా కేంద్రంలో ఉందని, ఆ రైతులు వారి బ్యాంకు అకౌంట్‌కు లింకు చేసుకుంటే డబ్బులు పడతాయని ఏవో టి.సంగీత తెలిపారు.బుధవారం మండలంలోని రఘుమండలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయ భూమి గల రైతు లు ఆగస్టు 23లోగా పంట రుణాలు తీసుకొని సంబంధించి ఇన్సురెన్స్ బ్యాంకుల్లో తీసుకోవాలని తెలిపారు. అన్నదాత సుఖీభవ లబ్ధిదారులు జాబితాలో లేనివారు రైతు సేవా కేంద్రాన్ని ఆగస్టు 23లోగా సంప్రదించి గ్రీవెన్స్‌లో పెట్టుకోవాలని చెప్పారు.

## శతశాతం చెత్త సేకరణ చేపట్టండి

బొబ్బిలి రూరల్, జూలై23 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో శతశాతం చెత్త సేకరణ జరిగాలని ఎంపీడీవో రవికుమార్ అన్నారు. బుధవారం మండంలోని జగన్నాథపురంలో ఆయన పర్యటించారు. అక్కడ చెత్త సేకరణను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించాలన్నారు. అలాగే చెత్త సేకరణ వాహనాలు క్రమం తప్పకుండా ప్రతి ఇంటికీ వెళ్లేలా చూడాలని పంచాయితీ కార్యదర్శిని ఆదేశించారు. క్లాప్ మిత్రలు తప్పనిసరిగా సమయపాలన పాటించాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి సింహాచలం ఉన్నారు.


మట్లాడుతున్న ఎంపీడీవో

## ఉపాధి పనులు పూర్తిచేయండి

బొబ్బిలి రూరల్, జూలై23 (ఆంధ్రజ్యోతి): మండలంలో చేపడుతున్న ఉపాధి పనులను పూర్తిచేయాలని ఏపీవో లక్ష్మీపతిరాజు క్షేత్ర సహాయకులను ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ భవనంలో క్షేత్ర సహాయకులు, సాంకేతిక సహాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్ర సహాయకులఉ నిర్దేశించిన లక్ష్యాల మేరకు పండ్ల మొక్కలు, ఫాం పాండ్స్ కందకాల పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పనుల్లో వేతనదారుల సంఖ్య పెంచాలన్నారు. 100 రోజులు పని కల్పించాలన్నారు. పనుల దస్త్రాలు, జాబ్ కార్డులు ఎప్పటికప్పుడు నవీకరణ చేసుకోవాలని ఏపీవో సూచించారు.


మాట్లాడుతున్న ఏపీవో లక్ష్మీపతిరాజు

## సమస్యలపై చర్యలు తీసుకోవాలి

గుర్ల, జూలై 23(ఆంధ్రజ్యోతి):సమస్యలపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ పొట్నూరు ప్రమీల కోరారు. బుధవారం స్థానికమండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన జరిగిన మండల సమావేశంలో పలు అంశా లపై చర్చ జరిగింది. సర్పంచ్‌లు నరసింహమూర్తి, అప్పల రాజు మాట్లాడుతూ రైతు సేవా కేంద్రంల్లో ఎరువులు అందుబాటులో లేవని ప్రశ్నించారు. పలువురు సర్పంచ్‌లు మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకంలో కొంతమంది రైతుల పేర్లు లేకపోవడంతో నష్టపోతున్నారన్నారు. కార్యక్ర మంలో జడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైస్ ఎంపీపీలు అంబల్ల లక్ష్మి, తోట తిరుపతిరావు, ఎంపీడీవో ఎటి.వరప్రసాద్, తహసీల్దార్ పి.ఆదిలక్ష్మి, పొట్నూరు సన్యాసినాయుడు పాల్గొన్నారు.

## పాఠశాలల పరిశీలన

చీపురుపల్లి, జులై 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆంజనేయపురం, వంగపల్లిపేట, బస్టాండ్ పాఠశాలలను విజయనగరం డైట్ ఉపన్యాసకులు అన్నారావు, రామారావుల బుధవారం పరిశీలించారు. గణితం, తెలుగు భాషలకు సంబంధించి విద్యార్థుల విద్యా ప్రమాణాలను తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

## లైన్ షోయింగ్ విధానంలో నాట్లు

సంతకవిటి, జూలై 23(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంలో వరిని లైన్ షోయింగ్ విధానంలో నాటడం వల్ల పంటకు దోమపోటు, చీడపీడలు ఆశించవని మాస్టర్ ట్రైనర్ పద్మావతి తెలిపారు. బుధవారం మండలంలోని మామిడిపల్లిలో ప్రకృతి వ్యవసాయం విధానంలో లైన్ షోయింగ్ ద్వారా వరిని నాటే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జిలు వెంకటరమణ, అప్పలనాయుడులు పాల్గొన్నారు.

## వేపాడలో వైసీపీ నాయకుల పర్యటన

వేపాడ, జూలై 23 (ఆంధ్రజ్యోతి):వేపాడ,వల్లంపూడిల్లో బుధవారం వైసీపీ నాయకులు బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో శృంగవరపుకోట మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, మండల అధ్యక్షుడు ముమ్మలూరి జగ్గుబాబు, ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు, జడ్పీటీసీ ఎస్.అప్పలనాయుడు పాల్గొన్నారు.




## కుక్కల స్వైరవిహారంతో భయాందోళన

బొబ్బిలి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో కుక్కల స్వైరవిహారం అధికంగా ఉంది. దీంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. మెయిన్ రోడ్డు, నాయుడు కాలనీ, బజారు రోడ్డుల్లో కుక్కలు గుంపులుగా సంచరిస్తున్నారు. ఒంటరిగా వెళ్తున్న వారిపై దాడి చేస్తున్నాయి. వాహనాలు వెంట పరుగులు తీస్తుండడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. బొబ్బిలి పట్టణంలో మూడు మున్సిపాలిటీలకు సంబంధించి కుక్కల సంతాన నిరోధక కేంద్రం ఉంది. అయినప్పటికీ కుక్కల సంతానం మరింత పెరిగిందని ప్రజలు అంటున్నారు. ఇకనైనా కుక్కల నియంత్రణకు యంత్రాంగం చర్యలు చేపట్టాల్సి ఉంది.


పట్టణంలో కుక్కల గుంపు

## యువతకు కౌన్సెలింగ్ నిర్వహించాలి

నెల్లిమర్ల, జూలై 23(ఆంధ్రజ్యోతి): యువత గంజాయికి బానిస కాకుండా అవగాహన సదస్సులు, కౌన్సెలింగ్ నిర్వహించాలని ఎస్‌ఐ బి.గణేష్ సూచించారు. బుధవారం నెల్లిమర్లలో మహిళా సంరక్షణ పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత గంజాయి బారినపడకుండా వినియోగం, రవాణా తదితర అంశాల గురించి సమాచారం ఎప్పటికప్పుడు చేరవేయాలని కోరారు.

## బ్యాటింగ్ టెక్నిక్స్‌పై అవగాహన

నెల్లిమర్ల, జూలై 23(ఆంధ్రజ్యోతి): స్థానిక సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో క్రీడా సౌకర్యాలను హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్. శ్రీధర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా క్రికెట్‌లో మెళకువలను వివరించారు. బ్యాటింగ్ టెక్నిక్‌లు, ఫాస్ట్ స్పిన్ బౌలింగ్‌ను ఎదుర్కోవడం తదితర అంశాలపై అవగాహనకల్పించారు. కార్యక్రమంలో వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పీకే మహంతి, రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్‌ఎస్ వర్మ, డాక్టర్ శ్రీధర్‌ను సత్కరించారు.

## వైద్యురాలిపై విచారణ

విజయనగరం రింగురోడ్డు, జూలై 23: ( ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సర్వ జన ఆసుపత్రిలో మెడికల్ అంకాలజిస్ట్‌గా విధులు నిర్వహిస్తున్న వైద్యురాలు పి.విజయలక్ష్మిని వైద్యాధికారులు విచారణ చేపట్టారు. కొద్ది రోజులుగా ఆమె ఓపీలో వైద్య సేవలు నిర్వహించకుండా గైర్హాజరు అవ్వడంతో ఓ వ్యక్తి వైద్యాధికారికి ఫిర్యాదు చేశారు. దీంతో బుధవారం డిప్యూటీ సూపరిటెండెంట్ డాక్టరు శివ శ్రీధర్, ఆర్‌ఎంఓ డాక్టరు కామేశ్వరరావు, హెచ్‌ఓడీ డాక్టరు సుదర్శి విచారణ చేపట్టారు.

## విద్యార్థినులకు నేత్ర పరీక్షలు

రాజాం రూరల్, జూలై23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గురవాం కేజీబీవీలో విద్యార్థినులకు జిల్లా అంధత్వ నివారణసంస్థ ఆ ధ్వర్యంలో బుధవారం నేత్రవైద్య పరీక్షలు నిర్వహించారు. కేజీబీవీలో ఏడు నుంచి ఇంటర్ వరకూ ప్రతి తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబ రిచిన విద్యార్థినులకు గోల్డ్, సిల్వర్ మెడల్స్‌ను ప్రభావతి జాగృతి ట్రస్ట్ ఆధ్వర్యంలో అందజేశారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేక అధికారి సావిత్రి, సప్పటి వసంతరావు పాల్గొన్నారు.

## నానో యూరియాతో ఎక్కువ లాభాలు

బొబ్బిలి రూరల్, జూలై23 (ఆంధ్రజ్యోతి): నానో యూరియా వాడకం వల్ల తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు పొందవచ్చని బొబ్బిలి డివిజన్ ఏడీఏ మజ్జి శామ్‌సుందర్ అన్నారు. బుధవారం మండలంలోని అలజంగిలో ఆయన పర్యటించారు. రైతులకు నానో యూరియా వాడకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీన్ని వినియోగించడం వల్ల సాధారణ యూరియాపై ఆధారాన్ని తగ్గించి, వ్యయాన్ని తగ్గిస్తుందన్నారు. దీని ప్రయోజనాలు, వినియోగించే విధానాలను వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు పెంట లత, వంగపండు వేణుగోపాల్ తదితరులున్నారు.


అవగాహన కల్పిస్తున్న ఏడీఏ

## విద్యార్థులకు వైద్య పరీక్షలు

బొబ్బిలి రూరల్, జూలై23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నారసింహునిపేట ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం పిరిడి వైద్యాధికారి డాక్టర్ రఘువంశీ వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నర్సింగ్ అసిస్టెంట్ తవిటినాయుడు, పిరిడి ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

## మోడల్ పాఠశాలలో తనిఖీ

బొబ్బిలి రూరల్, జూలై23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలవరాయి మోడల్ ప్రాథమిక పాఠశాలను బుధవారం ఎంఈవో సీహెచ్.లక్ష్మణరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత విద్యార్థుల హాజరు పట్టీ పరిశీలించారు. అనంతరం విద్యార్థుల హోంవర్క్, పఠన నైపుణ్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సింహాచలం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఘనంగా తిలక్ జయంతి

బొబ్బిలి రూరల్, జూలై23 (ఆంధ్రజ్యోతి): పక్కిలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం బాల గంగాధర్ తిలక్ జయంతి వేడుకలు నిర్వహించారు. హెచ్‌ఎం జేవీవీఎస్‌ఎన్ రాజు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. తిలక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా బాలగంగాధర్ తిలక్.. కేసరి పత్రిక ద్వారా ప్రజల్లో స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని నింపారని కొనియాడారు, కార్యక్రమంలో ఉపాధ్యాయలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సూపర్‌సిక్స్ పేరిట మోసం

బొబ్బిలి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): సూపర్‌సిక్స్ పేరుతో జనాన్ని చంద్రబాబు మోసం చేశారని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ఆరోపించారు. ఎన్నికల్లో లేనిపోని హామీలు ఇచ్చి అధికారంలోనికి వచ్చిన కూటమి ప్రభుత్వ ఇప్పుడు ఏమీ చేయలేక చేతులెత్తేసిందన్నారు. బుధవారం పట్టణంలోని మూడో వార్డులో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు చోడిగంజి రమేష్‌నాయుడు, సీనియర్ నాయకులు ఇంటి గోపాలరావు, సావు వెంకటమురళీకృష్ణారావు, రేజేటి విస్సు తదితరులున్నారు.

## వ్యవసాయానికి నిరంతర విద్యుత్ ఇవ్వాలి

నెల్లిమర్ల, జూలై 23(ఆంధ్రజ్యోతి): వ్యవసాయానికి నిరం తరం విద్యుత్ ఇవ్వాలని రైతు సంఘం నాయకులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. బుధవారం నెల్లిమర్లలో విలేకరులతో మాట్లాడుతూ మండలంలో పలు చోట్ల అధికారులు మరమ్మతులు పేరిట విద్యుత్ కోతలు అమలు చేసి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇకనైనా మెరుగైన విద్యుత్ సరఫరా చేయాలని కోరారు.









